

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 23 సెప్టెంబరు 2021 సంపుటి : 03 సంచిక : 45 పేజీలు : 4 వెల : రూ 3-00

# ఇళ్ల పట్టాల దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలి: సీఎం జగన్



అమరావతి: నెల రోజుల్లో ఇళ్ల పట్టాల పంపిణీపై కోర్టుల్లో పెండింగ్ కేసులన్నీ పరిష్కారం అవుతాయని ఆశిస్తున్నట్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులకు లే అవుట్ల వారీగా వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం స్పందన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలని తెలిపారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్? పథకంలో రిజిస్ట్రేషన్ పట్టాలిచ్చే కార్యక్రమం డిసెంబర్‌లోగా చేయాలన్నారు. లే అవుట్లలో విద్యుత్, నీటి వసతిపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. మహిళలకు రూ.35 వేలు పావలా వడ్డీకే బ్యాంకర్లు రుణాలు ఇచ్చేలా చూడాలని పేర్కొన్నారు. వారానికొకసారి ఇళ్ల నిర్మాణంపై కలెక్టర్లు సమీక్ష చేయాలని సీఎం జగన్ ఆదేశించారు. నెల రోజుల్లో ఈ కేసులన్నీ పరిష్కారమవుతాయని ఆశిస్తున్నానని సీఎం జగన్ తెలిపారు. పెండింగ్ కేసుల్లో 395 కేసులు తాత్కాలిక స్టేలు ఉన్నాయని చెప్పారు. వాటిపైన కూడా దృష్టిపెడితే.. పేదలకు మేలు జరుగుతుందని, లే అవుట్ వారీగా, ప్లాట్ల వారీగా లబ్ధిదారుల వివరాలను తెలియజేస్తూ మ్యాపింగ్ చేశామని అన్నారు. ప్రభుత్వం తయారు చేసిన యాప్‌లో ఈ వివరాలన్నింటినీ ఉంచాలని తెలిపారు. లే అవుట్ల వారీగా వివరాలు తెలపాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. దాని వల్ల మిగిలిన ప్లాట్లను కొత్తగా లబ్ధిదారులకు కేటాయించడానికి వీలు కలుగుతుందన్నారు. మిగిలిపోయిన 12.6 శాతం మ్యాపింగ్ పనులను కలెక్టర్లు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. ఇళ్ల పట్టాల కోసం పెట్టుకున్న దరఖాస్తుల్లో పెండింగ్ ఉంటే వెంటనే వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఇదివరకే ఉన్న లే అవుట్లలో 45,600 మందికి, ప్రభుత్వ లే అవుట్లలో 10,851 మందికి డిసెంబర్‌లో పట్టాలు అందించాలన్నారు. 1,48,398 మందికి పట్టాలు ఇవ్వడానికి కొత్తగా భూసేకరణ చేయాల్సి ఉందన్నారు. వన్ టైం సెటిల్‌మెంట్ పథకానికి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకంగా పేరు పెట్టినట్లు తెలిపారు. ఈ పథకంలో రిజిస్ట్రేషన్ పట్టాలు ఇచ్చే కార్యక్రమం కూడా డిసెంబర్‌లో చేయాలని తెలిపారు. పేదలందరికీ ఇళ్ల పథకలో భాగంగా మొదటివిడతలో 15.6 లక్షల ఇళ్లు కడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకూ 10.31 లక్షల ఇళ్లు గ్రౌండ్ అయ్యాయని, అక్టోబరు 25 నాటికల్లా బిలో బేస్‌మెంట్ లెవల్ ఇళ్లను బేస్‌మెంట్‌లెవల్‌పై స్థాయికి తీసుకువచ్చేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్షన్ –3ని ఎంపిక చేసుకున్న ఇళ్ల పనులు అక్టోబరు 25 నుంచి మొదలుపెట్టడానికి అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లబ్ధిదారులతో కలిపి గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే 2.25 లక్షల లబ్ధిదారులతో 18,483 గ్రూపులు ఏర్పాటు చేశారని, ఈ నెలాఖరు కల్లా గ్రూపుల ఏర్పాటు పూర్తికావాలన్నారు. లే అవుట్లలో నీటి వసతిని ఏర్పాటు చేయడంపై దృష్టిపెట్టాలని సూచించారు. మిగిలిపోయిన లే అవుట్లలో విద్యుత్తు, నీటి వసతిని కల్పించడంపై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. సిమెంటు, బ్రిక్స్, ఐరన్ స్టీల్, మెటల్.. వాటి వినియోగం విపరీతంగా పెరుగుతుందని, ఆర్థిక వ్యవస్థ ఊపందుకుంటుందని తెలిపారు. ఆప్షన్ ?3 ఎంచుకున్న ప్రాంతాల్లో 1.75 లక్షలకే ఇంటి నిర్మాణం పూర్తవుతుందని తెలిపారు. ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు రూ.35 వేలు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లతో మాట్లాడుతున్నామని తెలిపారు. బ్యాంకర్లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని వారికి రుణాలు అందించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు వారానికి ఒకసారి ఇళ్ల నిర్మాణంపై సమీక్ష చేయాలన్నారు. మున్సిపాలిటీ స్థాయి, మండలాల స్థాయి, పంచాయతీల స్థాయి, లే అవుట్ స్థాయిల్లో కూడా సంబంధిత అధికారులు ఇళ్ల నిర్మాణ ప్రగతిపై రివ్యూ చేయాలన్నారు. అలా చేయగలిగితేనే వేగంగా నిర్మాణాలు సాగుతాయని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తేనే అక్కడ సమస్యలు ఏంటో తెలుస్తాయన్నారు. పెద్ద లే అవుట్లలో నిర్మాణసామగ్రిని ఉంచడానికి, సైట్ ఆఫీసులకోసం గోడౌన్లను నిర్మించాలని తెలిపారు. ఉపాధిహామీ పనుల కింద ఈ గోడౌన్లను నిర్మించాలని సీఎం పేర్కొన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్స్, బీఎంసీయూలు, డిజిటల్ లైబ్రరీల పనులు చురుగ్గా సాగాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. గత ప్రభుత్వం ఇవ్వని బిల్లులకు సంబంధించి ఇప్పుడు ప్రభుత్వం ఇవ్వాల్సి వస్తోందని, కేంద్రం నుంచి వచ్చిన డబ్బు కన్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికంగా ఖర్చు చేశామని తెలిపారు. నిధులకు ఇబ్బంది లేకుండా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైన కూడా దృష్టి పెడుతున్నామని తెలిపారు. కలెక్టర్లు ఈ పనులపై దృష్టిపెట్టి ముందుకుసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ 31 నాటికల్లా 4,530 పంచాయతీల్లో ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వస్తోందని తెలిపారు. అన్ లిమిటెడ్ బ్యాండ్ విడ్త్, వర్క్ ఫ్రం హోం సౌకర్యం గ్రామాల్లో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆలోగా డిజిటల్ లైబ్రరీలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. విలేజ్, వార్డు సచివాలయాల్లో తనిఖీలు చాలా ముఖ్యమైనవని, అలసత్వం వహించిన వారిపై చర్యలకూ వెనుకాడమని సీఎం జగన్ అన్నారు. కలెక్టర్లు ప్రతివారం 2 సచివాలయాలు, జాయింట్ కలెక్టర్లు వారానికి 4 సచివాలయాలు, మున్సిపల్ కమిషనర్లు, ఐటీడీఏ పీఓలు, సబ్ కలెక్టర్లు వారానికి నాలుగు సచివాలయాలను తప్పని సరిగా సందర్శించాలన్నారు. వచ్చే నెల నుంచి ఎమ్మెల్యేలు కూడా వారానికి నాలుగు సచివాలయాలను సందర్శించాలని చెబుతామని సీఎం జగన్ అన్నారు. డిసెంబర్ నుంచి తాను కూడా సచివాలయాలను సందర్శిస్తూ ప్రతి పర్యటనలో సచివాలయాలను చూస్తానని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల సందర్శన చేస్తున్న సమయంలో ఏయే అంశాలపై దృష్టి పెట్టాలో మార్గదర్శకాలు కూడా ఇచ్చామని పేర్కొన్నారు. ప్రతి సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిపి బృందాలుగా ఏర్పడి ప్రజల్లో అవగాహన, చైతన్యం కలిగించేలా ఆ గ్రామంలో పర్యటించాలని చెప్పామని అన్నారు. ప్రతినెలా చివరి శుక్రవారం, చివరి శనివారం సిటిజన్ అవుట్ రీచ్ కార్యక్రమం, సెప్టెంబరు 24, 25 తేదీల్లో సిటిజన్ అవుట్‌రీచ్ కార్యక్రమం, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు, ముఖ్యమైన ఫోన్ నంబర్లతో కూడిన పాంప్లెట్లను వారికి అందించాలన్నారు. నిర్దేశించుకున్న రోజుల్లోగా అర్హులైన వారికి మంజూరు జరగాలని సీఎం జగన్ సూచించారు. కోవిడ్ తీవ్రత తగ్గిందని, ఉధృతంగా ఉన్న కాలంలో పాజిటివిటీ రేటు 25.56 శాతం ఉందని తెలిపారు. ప్రస్తుతం 2.5 శాతం కన్నా తక్కువగా ఉందని, రికవరీ రేటు కూడా 98.63శాతంగా ఉందని పేర్కొన్నారు. కోవిడ్ పట్ల ఎలాంటి అలసత్వం వద్దని, 2 డోసుల వ్యాక్సినేషన్ 100శాతం పూర్తయ్యేంతవరకూ కూడా ఎలాంటి పరిస్థితుల్లో కోవిడ్ పట్ల నిర్లక్ష్యం వద్దని సీఎం అధికారులకు సూచించారు.

# పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటిని కలిసిన ఏషియన్ పెయింట్స్ ప్రతినిధులు



**రెండో దశ విస్తరణ పనులకు సన్నద్ధమవుతున్నట్లు మంత్రికి వెల్లడి**
**మొబైల్ కలర్ అకాడమీ ద్వారా ప్రతి ఏడాది 15-17వేల మందికి పైగా పెయింటింగ్ లో శిక్షణ**

అమరావతి, సెప్టెంబర్ , 22 పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డితో ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ ప్రతినిధులు సమావేశమయ్యారు. బుధవారం ఉదయం కానూరులోని మంత్రి మేకపాటి క్యాంపు కార్యాలయంలో సమావేశమై ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ కరెంట్ అఫైర్స్ గ్రూప్ హెడ్ అమిత్ కుమార్ సింగ్ తమ కంపెనీకి సంబంధించిన పలు కీలక విషయాలపై మంత్రితో చర్చించారు. ఏషియన్ పెయింట్స్ 2019, జనవరి, 4న ఉత్పత్తిని ప్రారంభించినట్లు మంత్రి మేకపాటికి అమిత్ కుమార్ సింగ్ వివరించారు. ఏషియన్ పెయింట్స్ కంపెనీ ఏపీలో విస్తరించాలనుకుంటున్న నేపథ్యంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, శిక్షణ వంటి విషయాలపై మంత్రి గౌతమ్ రెడ్డి ఆరా తీశారు. మొదటి దశలో రూ.1350 కోట్ల పెట్టుబడి పెట్టి, 700 మందికి ఉపాధి అందించాలనుకున్న లక్ష్యాన్ని అధిగమించి 750 మందికి ఉద్యోగాలిచ్చామని మంత్రికి తెలిపారు. అందుకు మంత్రి మేకపాటి ఏషియన్ పెయింట్స్ సంస్థ నిబద్ధతని అభినందించారు. ఫ్యాక్టరీకి ఐజీబీసీ ప్లాటినం సర్టిఫికెట్ సహా వర్షపు నీటిని ఒడిసిపట్టుకుని సంస్థకు స్వయంగా వినియోగించుకునే హార్వెస్టింగ్ స్ట్రక్చర్, రిన్యువబుల్ విద్యుత్ ఏర్పాటు ద్వారా 5.2 మెగా వాట్ల (సోలార్, విండ్) విద్యుత్ ఉత్పత్తి చేసుకుని 75శాతం అవసరాలకు వినియోగించుకున్నట్లు వివరించారు. ఏషియన్ పెయింట్స్ ఏడాదికి విడుదల చేసే సీఎస్ఆర్ నిధులను రూ.3 కోట్లు సామాజిక బాధ్యత కింద విశాఖ అభివద్ధి కోసం వినియోగించినట్లు పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో అదనంగా కోవిడ్ విపత్తు నిర్వహణ కోసం మరో రూ.3 కోట్లు అదనంగా ముఖ్యమంత్రి సహాయనిధికి అందించిన విషయాన్ని మంత్రి గౌతమ్ రెడ్డి వద్ద ప్రస్తావించారు. ప్రతి ఏడాది తమ మొబైల్ కలర్ అకాడమీ ద్వారా 15000 నుంచి 17000 మందికి శిక్షణ అందించి పెయింటర్లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రికి అమిత్ కుమార్ సింగ్ వెల్లడించారు. ప్రతి ఏడాది వైజాగ్ లో 75 మంది ఐ.టీ.ఐ అభ్యర్థులకు శిక్షణ అందిస్తున్నామన్నారు. త్వరలోనే రెండో దశ పనులు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నామని మంత్రికి తెలిపారు. ప్రస్తుతం 3 కె.ఎల్ సామర్థ్యంతో ఉన్న ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ రెండో దశ పూర్తి నాటికి కె.ఎల్ సామర్థ్యంతో పెయింట్స్ రంగంలో అతిపెద్ద సంస్థగా అవతరించనుందని మంత్రి మేకపాటికి వివరించారు.

# వైసీపీ పాలనలో ఏపీ 20 ఏళ్లు వెనక్కెళ్లింది: చంద్రబాబు



అమరావతి: వైసీపీ పాలనలో ఏపీ 20 ఏళు వెనక్కెళ్లిందని టీడీపీ అధినేత చంద్రబాబు దుయ్యబట్టారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి లేదు, ఉపాధి, పెట్టుబడులు లేవన్నారు. సీఎం జగన్‌రెడ్డి పాలనలో వ్యవసాయరంగం సంక్షోభంలో పడిందని తెలిపారు. ప్రభుత్వ సాయం అందక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, టీడీపీ హయాంలో వ్యవసాయాన్ని అన్ని విధాల ప్రోత్సహిం చామని తెలిపారు. అమరావతి, పోలవరం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామ న్నారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020 జూన్ నాటికి పోలవరం పూర్తయ్యేదని చంద్రబాబు చెప్పారు. జగన్ వచ్చి అమరావతిని, పోలవరాన్ని నాశనం చేశారని దుయ్యబట్టారు. అఫ్ఘానిస్తాన్ నుంచి ఏపీకి డ్రగ్స్ దిగుమతి జరుగుతోందని, సీఎం ఇంటి సమీపంలో ఓ కంపెనీ పేరుతో రూ.21 వేల కోట్ల హెరాయిన్ పట్టుబడిందన్నారు. డగ్స్ వ్యాపారంతో ఉగ్రవాదుల్ని ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రం బాగుపడాలంటే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలని చంద్రబాబు పేర్కొన్నారు.

# జగన్ సర్కార్ కు మరో షాక్

విజయవాడ, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)టీడీ పాలకమండలి సభ్యుల నియామకంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీరియస్ అయింది. ప్రత్యేక ఆహ్వానితులను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సస్పెండ్ చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి ఇటీవల జంబో పాలకవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 31 మంది సభ్యులతోపాటు.. మరో 52 మందిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వం జీవోలను కూడా జారీ చేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వులపై పలువురు హైకోర్టును ఆశ్రయించారు. వాటిపై హైకోర్టులో మూడు పిటిషన్లు దాఖలు అయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రత్యేక ఆహ్వానితులను నియమించారంటూ పిటిషనర్ల తరపు న్యాయవాదులు ప్రధానంగా కోర్టులో వాదించారు. దీనివల్ల సామాన్య భక్తులపై భారం పడుతుందని వివరించారు. ఇక వాదోపవాదనలు విన్న న్యాయస్థానం పిటిషనర్ల తరపు వాదనలను ఏకీభవిస్తూ ప్రత్యేక ఆహ్వానితుల నియామకాన్ని తప్పుబట్టింది. అలాగే టీటీడీ బోర్డు నిర్ణయంపై సీరియస్ అయింది. దీనితో ప్రత్యేక ఆహ్వానితులను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది.




# పెట్టుబడులతో వచ్చే వారికి స్వాగతం: కన్నబాబు



విజయవాడ: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతాము అని వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎగుమతుల అవకాశాలపై ఆయన చర్చించారు. విజయవాడలో జరుగుతున్న వాణిజ్య ఉత్సవం కార్యక్రమం రెండురోజులో భాగంగా బుధవారం కన్నబాబు ప్రసంగించారు. సీఎం జగన్ పారిశ్రామికాభివృద్ధి కోసం సులభతరమైన పాలసీలను అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతున్నాం అన్నారు కన్నబాబు. "ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి , అనుబంధ రంగాల పరిశ్రమల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. సీఎం జగన్ సమర్ధవంతమైన పాలనలో కోవిడ్ సమయంలోనూ ఏపీలో ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. దేశం మొత్తం ఎగుమతుల్లో 5.8% వాటాతో ఎగుమతుల్లో 4వ ర్యాంకులో ఏపీ నిలిచింది. 2020–21లో రాష్ట్రంలోని పోర్టుల నుంచి 172 మిలియన్ టన్నుల ఎగుమతులు జరిగాయి. ఫుడ్ ప్రోసెసింగ్ క్లస్టరులను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసి పంట ఉత్పత్తులకు అదనపు విలువ చేకూరుస్తున్నాం" అని కన్నబాబు తెలిపారు.

# మాండవీయా.. మీకు ధన్యవాదాలు: డబ్ల్యూహెచ్ఓ

దిల్లీ: భారత ఆరోగ్యమంత్రి మన్‌సుఖ్ మాండవీయాకు బుధవారం ఉదయం ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్ఓ) నుంచి కృతజ్ఞతలు లభించాయి. అక్టోబర్ నుంచి మళ్లీ ప్రపంచ దేశాలకు కరోనా టీకాలను ఎగుమతి చేయనున్నట్లు కొద్ది రోజుల క్రితం మాండవీయ చేసిన ప్రకటనే ఇందుకు కారణం. కరోనా టీకా ఉత్పత్తిలో ముందువరుసలో ఉన్న భారత్.. దేశంలో టీకాలు అందుబాటులోకి వచ్చిన సమయంలోనే పలు దేశాలకు ఎగుమతి చేసింది. మరికొన్ని దేశాలకు టీకాలను విరాళంగా ఇచ్చి ఉదారతను చాటుకొంది. అయితే ఏప్రిల్‌లో కరోనా రెండో దశ ప్రారంభం కావడంతో భారత్ వ్యాక్సిన్ మైత్రికి బ్రేక్ పడింది. అప్పటి నుంచి స్వదేశంలోని టీకా కార్యక్రమంపైనే దృష్టిపెట్టింది. ఇటీవల కాలంలో రికార్డు స్థాయిలో టీకాలు అందిస్తూ.. కేంద్రం విధించుకున్న లక్ష్యం దిశగా ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే మిగులు టీకాలను అక్టోబర్ నెల నుంచి ఎగుమతి చేస్తామని ఆరోగ్య మంత్రి ప్రకటించారు. దేశీయ అవసరాలకు సరిపోగా మిగిలిన టీకాలను వ్యాక్సిన్ మైత్రి, కొవాక్స్‌కు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. దీనిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ టెడ్రోస్ అధనామ్ ట్విటర్ వేదికగా స్పందించారు. 'అక్టోబర్‌లో కొవాక్స్‌కు భారత్ తిరిగి కొవిడ్ టీకాలు అందించనున్నట్లు ప్రకటించింది. దీనిపై ఆ దేశ ఆరోగ్య మంత్రి మన్‌సుఖ్ మాండవీయాకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ ఏడాది చివరి నాటికి ప్రపంచ దేశాల్లో 40శాతం టీకా లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ నిర్ణయం ఎంతో కీలకమైంది' అంటూ టెడ్రోస్ ట్వీట్ చేశారు. ఆరోగ్య సంస్థ, గవి వ్యాక్సిన్ అలయన్స్ ఆధ్వర్యంలో కొవాక్స్ కార్యక్రమం నడుస్తోంది. పలు దేశాల నుంచి టీకాలను సేకరించి, అంతర్జాతీయంగా పంపిణీ చేస్తోంది. అయితే భారత్ ఎగుమతి నిలిపివేయడం ఈ కార్యక్రమంపై ప్రభావం చూపింది. ఇదిలా ఉండగా.. ప్రధాని మోదీ అమెరికా పర్యటన, ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రసంగం నేపథ్యంలో మాండవీయ ప్రకటన వెలువడింది.



# సంపాదకీయం

గురువారం 23 సెప్టెంబరు 2021

## బ్యాడ్ బ్యాంకుల ఆశ ఫలిస్తుందా

ప్రజల డబ్బుతోనే వ్యాపారం చేసే వాణిజ్య బ్యాంకులు సామాన్యులకు రుణం కావాలంటే అడిగే నిబంధనలు అన్నీ ఇన్నీ కాదు. లక్ష రూపాయలు రుణం కావాలంటే సవాలక్ష నిబంధనలు విధిస్తాయి. పలు పర్యాయాలు తిప్పించుకుని ఆస్తి పత్రాలు, హామీ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి శల్య పరీక్షలు చేసిన పిదపే రుణాలను మంజూరు చేస్తున్నాయి. ఒక వేళ నిర్ణీత సమయం లోగా రుణం చెల్లించక పోతే వారు హామీగా పెట్టిన బంగారు ఆభరణాలు కానీ ఆస్తులు కానీ పత్రికా ప్రకటన ఇచ్చి బహిరంగ వేలం ద్వారా ఆ రుణాలను వడ్డీతో సహా తిరిగి వసూలు చేసుకుంటున్నాయి.ఇన్ని జాగ్రత్తలు పాటించే బ్యాంకులకు మొండి బాకీల సమస్య ఎందుకు ఉత్పన్నమవుతుంది? ఈ మొండి బకాయిలు అనేవి సామాన్య ప్రజానీకానివి మాత్రం కావు.రాజకీయ ప్రాబల్యం మెండుగా ఉన్న కార్పొరేట్ పెట్టుబడుదారులు ఎగ వేసిన రుణాలు మాత్రమే. వీరు తీసుకున్న పెద్ద మొత్తాల రుణాలను తిరిగి వసూలు చేయలేని స్థితిలో అవి మొండి బకాయిలుగా బాంకులకు గుదిబండలుగా తయారై బాంకులు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోవడానికి కారణం అవుతున్నాయి.సామాన్యులు దగ్గర ముక్కు పిండి వసూలు చేసే బ్యాంకులు ఈ పెట్టుబడిదారుల వద్ద తిరిగి ఎందుకు వసూలు చేయలేక పోతున్నాయి అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలి పోయింది.ఒకటి కాదు రెండు కాదు లక్షల కోట్లు ఇలా మొండి బకాయిలు రూపంలో బ్యాంకులకు బడా కార్పొరేట్ సంస్థలు ఎగనామం పెడుతున్నాయి ఈ మొండి బకాయిలునే బ్యాంకింగ్ భాషలో ఎన్‌పీఏ.. నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ అంటారు. రిజర్వు బ్యాంకు చెబుతున్న దాని ప్రకారం బ్యాంకులకు తామిచ్చిన రుణాలకు నిర్ణీత వ్యవధిలో వాయిదాలు తిరిగి రాకపోతే వాటిని ఎన్‌పీఏ అంటారు. ఇవి కార్పొరేట్ పెద్దమనుషుల వల్లనే జరిగాయి. వీరి మితిమీరిన మొండి బాకీల వల్ల ప్రభుత్వ రంగ బ్యాంకులు సంక్షోభంలో కూరుకుపోవడం ఆరంభం అయ్యాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు జాతీయాకరణ లక్ష్యానికి తిలోదకాలు ఇచ్చి పెద్ద వాళ్లకు గంపగుత్తగా రుణాలు అందించడం వల్లనే ఈ పరిస్థితి దాపురించింది. కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు బ్యాంకులలో పొదుపు చేస్తున్న పేదవర్గాల వారి పొదుపులను మూట కట్టి బడా కార్పొరేట్ వర్గాలకు రుణాలను ఇచ్చి తిరిగి వారి నుండి వసూలు చేయలేక రాని బకాయిలుగా మార్చుకుంటున్నాయి.బ్యాంక్ ఆస్తుల పట్టీలో ఈ సమాచారాన్ని తొలగిస్తున్నాయి. అంతే కాదు ఒక్క కలం పోటుతో మూడవ కంటికి తెలియకుండా వాటిని రద్దు కూడా చేసేస్తున్నాయి సామాన్యుల ఖాతాల్లో అయితే కనీస నిల్వలు లేవని ఆ సాకు ఈ సాకు చెప్పి బ్యాంకులు పెనాల్టీ ల రూపంలో వేల కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నాయి. ఇలా వసూలు చేసిన మొత్తాలను బడా బాబులకు ఇచ్చి పారు బాకీలుగా తయారు చేస్తున్నాయి. అంతే కాదు ఈ మొండి బకాయిలు లేదా పారు బాకీలు సమాచారాన్ని కూడా బ్యాంకులు ప్రభుత్వాలు కూడా గోప్యంగా ఉంచేవి. అయితే 2015 లో రఘురామరాజ్ గవర్నర్ గా ఉన్నప్పుడు అసెట్స్ క్వాలిటీ రివ్యూ పేరిట జరిపిన సమీక్షలో ఈ నిజాలు బయటకు వచ్చాయి.దాచి పెట్టబడిన వాటిని ఆస్తి అప్పుల పట్టీలో చూపాలని ఆర్.బీ.ఐ.నిర్ణయించింది. దాని కారణంగా మొండి బకాయిల వాస్తవికత బయటకు వచ్చింది.నాటి నుండి నిరర్థక ఆస్తులు పెరుగుతూ వచ్చాయి.నోట్ల రద్దు తరువాత ఈ నిరర్థక ఆస్తులు మరింత వేగం పుంజుకున్నాయి.అయితే ఈ మొండి బకాయిల సమస్య నుండి బయట పడటానికి 2002 లో ప్రత్యేక చట్టం ద్వారా అసెట్ రీ కనస్ట్రక్షన్ కంపెనీలను ఏర్పాటు చేశారు.బ్యాంకుల మొండి బకాయిలను వీటికి అమ్మివేస్తే వాటి నుంచి లభించే కొద్దీ మొత్తంతో అయినా కొంతలో కొంత అయినా పాత బాకీలు తిరిగి వసూలు చేసుకోవచ్చు అనే ఆలోచనతో దీనికి సిద్ధం అయ్యారు.దానితో ప్రైవేట్ ఏ.ఆర్.సీ లను బాంకులు ఆశ్రయించడం ఆరభించాయి.ఉదాహరణకు 10 కోట్లు మొండి బకాయి ఈ కంపెనీలకు అప్పగిస్తే 3 లేదా 4 కోట్లు బ్యాంకులకు అప్పగించి మిగిలిన మొత్తాలను పొందే ఉద్దేశ్యంతో రిస్క్ చేసి ఇవి ప్రయత్నం చేసేవి.అయితే ఈ ప్రయత్నం నిరర్థక ఆస్తులకు ఒక ఉపశమనం తప్ప నివారణ మాత్రం కాదు. ఇటువంటి ప్రైవేట్ కంపెనీలు మన దేశంలో దాదాపు 26 వరకూ ఉన్నాయి.అయితే ఇవి కూడా మొండి బకాయిల వసూలు విషయంలో మాత్రం విజయవంతం కాలేదని చెప్పవచ్చు ఎందుకంటే 2016-17 ఆర్థిక సర్వే ప్రైవేట్ అసెట్ రీ కనస్ట్రక్షన్ కంపెనీలు రుణాలు వసూలు విషయంలో సత్ఫలితాలు సాధించ లేకపోయాయని పేర్కొనడం జరిగింది. ఈ కారణంగా అవి మొండి బకాయిల స్వీకరణకు ముందుకు రావడం తగ్గడం జరిగింది.ఇదే సమయంలో బ్యాంకుల ఇక్కట్ల పరిష్కారానికి ప్రభుత్వం డెట్ ట్రిబ్యునల్ రికవరీ ఏర్పాటు చేసి 6 నెలల్లో ఈ మొండి బకాయిలకు పరిష్కారం చూపాలని ప్రయత్నం చేయగా ఈ తరహా కేసులు వేల కొద్ది ఉండటం వలన ఈ ఆశయం కూడా నెరవేర లేదు. మొత్తం రూ.30,600 కోట్ల విలువైన రసీదులకు ప్రభుత్వ హామీ ఇచ్చింది. ఈ విధానంలో ప్రతిపాదిత బ్యాడ్ బ్యాంక్ 15 శాతం రుణాలకు నగదు రూపంలో చెల్లించనుండగా.. మిగిలిన 85 శాతం ప్రభుత్వ హామీ కలిగిన సెక్యూరిటీ రసీదులను జారీ చేయడానికి ప్రభుత్వం సిద్ధం అయ్యింది. ఇదంతా కేవలం సిద్ధాంతమే తప్ప వాస్తవంలో ఏం జరుగుతుంది అనేది కాలమే సమాధానం చెప్పాలి. ఏది ఏమైనా ఇది తాత్కాలిక ఉపశమనం తప్ప ఇది పూర్తి పరిష్కారం మాత్రం కాదు.బ్యాడ్ బ్యాంకులు వలన బ్యాంకుల బాలన్స్ షీట్ ప్రక్షాళన అవుతుంది తప్ప సమస్య మరలా పునరావృతం కాదని చెప్పలేము. మరలా ఎన్.పీ.ఏలు పుట్టుకొస్తునే ఉంటాయి. వాటిని బాడ్ బ్యాంక్‌లకు బదిలీ జరుపుతూనే ఉంటారు. మొండి బాకీలకు సంబంధించి రికవరీలు భారీగా చేయగలిగితే చట్టంలో లొసుగులు మరియు రాజకీయ వత్తిడులు ఉన్నంత కాలం ఇది సఫలీకృతం అవుతుంది అని ఆశించడం అత్యాశే అవుతుంది.బ్యాడ్ బాంక్ విజయవంతం అనే దాని కన్నా బ్యాంకుల నుండి భవిష్యత్ లో కొత్త ఎన్.పీ.ఏ లు రాకుండా చూడటం అనేది ప్రభుత్వ లక్ష్యంగా భావించాలి.

# ముందు ఆలోచనలో టీడీపీ అధినేత

విజయవాడ, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)చంద్రబాబుని అందుకే గండరగండడు అన్నారు. ఆయన రేపటి రోజున ఏం జరుగుతుందో ఊహిస్తారు. ఒకవేళ అలా జరగకపోయినా మరో రూట్ ని కూడా రెడీ చేసి సిద్ధంగా పెట్టుకుంటారు. తాను అనుకున్నది జరగలేదని నిరాశ పడరు సరికదా ఫలితం వచ్చేంతవరకూ పరితపిస్తారు. అదే చంద్రబాబుని ఎక్కడో చంద్రగిరిలో ఎమ్మెల్యే స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ తీసుకువచ్చింది. ఏపీలో ఇప్పటికిపుడు చూస్తే రాజకీయం అంతా చంద్రబాబుకు వ్యతిరేకంగా ఉంది. అది ఆయనకూ తెలుసు. ఒక వైపు వైసీపీ కత్తులు నూరుతోంది. సోము వీర్రాజు ప్రెసిడెంట్ అయ్యాక బీజేపీ మొత్తానికి మొత్తం యాంటీ అయింది. తోడుగా జనసేన కూడా పొత్తులో ఉంది. దాంతో చంద్రబాబు గొంతు వినిపించకుండానే పొలిటికల్ కథ నడిపించేస్తున్నారు.ఏపీలో బీజేపీ ఊపూ సోము వీర్రాజు మోజు ఎంతకాలం అన్నదే ఇపుడు టీడీపీలో చర్చగా ఉందిట. వచ్చే ఏడాది జరిగే లోకల్ బాడీ ఎన్నికల్లో ఏ మాత్రం రిజల్ట్ చూపించకపోయినా సోము వీర్రాజును మైనస్ మార్కులు అధినాయకత్వం వద్ద పడతాయి అని అంచనాలు వేస్తున్నారుట. ఇదిలా ఉంటే ఏపీలో సోము వీర్రాజు వచ్చాక అతివాదం పెరిగింది. హిందూ కార్డు ఇపుడు జోరు చేస్తోంది. ఇది ఒక విధంగా జనసేనకు కూడా ఇబ్బందిగా ఉంటుందని, స్వతహాగా ఆ భావజాలం లేని పవన్ కళ్యాణ్ ఎంతకాలం ఈ వీర హిందూయిజాన్ని మోస్తారని కూడా విశ్లేషణలు కూడా ఉన్నాయి.ఇక ఏపీలో బీజేపీ చిన్న పార్టీ. జాతీయ స్థాయిలో ఆ పార్టీకి మోడీ లాంటి ప్రధాని ఉండొచ్చు, 300 కి పైగా ఎంపీలు ఉండొచ్చు. కానీ ఏపీలో బీజేపీకి నోటా కంటే కూడా తక్కువ ఓట్లే పడ్డాయన్నది నిజం. అదే సమయంలో జనసేనకు ఆరు శాతం ఓటు బ్యాంక్ ఉంది. ఇక పవన్ కళ్యాణ్ సినీ గ్లామర్, బలమైన సామాజిక వర్గం కూడా ఉన్నాయి. ఆయన అందరి వాడుగా రాజకీయాల్లో ఉండాలని ఆయన అభిమానులు అయితే కోరుకుంటున్నారు. కానీ పవన్ బీజేపీతో పొత్తు పెట్టుకుని దీక్షలు చేయడం నచ్చని వారు ఆ పార్టీలో కూడా ఉన్నారుట. ఇవాళ కాకపోయినా రేపు అయినా బీజేపీలోని మేధావి వర్గం కానీ చదువరులు కానీ దీని మీద అసంత్రుప్తి గట్టిగా వ్యక్తం చేస్తే పవన్ తన రూటు మార్చుకోవాల్సిరావడం ఖాయం. ఇక పవన్ కూడా బీజేపీ పెద్దన్న పోకడల పట్ల కొంత ఆలోచన చేస్తున్నారని అంటున్న వారూ ఉన్నారు.వస్తే బీజేపీ, జనసేనా రెండూ కలసి రావాలి. అపుడు 2014 ఎన్నికల ఎన్నికల మాదిరిగా మళ్ళీ పొత్తు ఉంటుంది. లేకపోయినా ఎన్నికల వేళకు జనసేన అయినా కలసివస్తుందని టీడీపీకి తెగ నమ్మకమట. ఒకవేళ జనసేనను దగ్గరకు చేస్తే ఆటోమేటిక్ గా బీజేపీ కూడా వస్తుంది. లేకపోతే వారికి వేరే ఆప్షన్ లేదు అన్నది చంద్రబాబు ఆలోచనగా ఉందని అంటున్నారు. బీజేపీతో పొత్తుకు వైసీపీ ఎటూ ఓకే చెప్పదు, ఇక మళ్ళీ ఒంటరి పోరు చేయడానికి బీజేపీ అసలు సాహసించరు. ఈ రకమైన లెక్కలు దగ్గర ఉండబట్టే చంద్రబాబు ధీమాగా ఉన్నారుట. మొత్తానికి పొత్తుల ఎత్తులో తాను కింగ్ నని బాబు మరో మారు నిరూపించుకుంటారా. వెయిట్ అండ్ సీ.

# బీజేపీకి ముందర కాళ్ల బంధంలో వైసీపీ



కాకినాడ, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)జగన్ ఇపుడు ఒక విషయం మీద కిందా మీద పడుతున్నారుట. ఏపీలో టీడీపీని బదనాం చేయడానికే ఇంతకాలం దృష్టి పెట్టిన జగన్ కి ఇపుడు పులి మీద పుట్ర అన్నట్లుగా బీజేపీ జనసేన కూటమి దూసుకురావడం షాకింగ్ పరిణామం అంటున్నారు. బీజేపీని చాలా తేలిగ్గా జగన్ తీసుకున్నారు. రెండు సీట్లలో ఓడిపోయిన తరువాత సంచీ సర్దేసి షూటింగ్ చేసుకుంటాడని పవన్ విషయంలోనూ తప్పుడు అంచనా వేశారు. కానీ ఈ ఇద్దరూ అనూహ్యంగా కలసి జగన్ సర్కార్ మీదకు దండయాత్రకు రావడమే కాదు, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అతి పెద్ద ఆందోళనగా అంతర్వేది రథం ఘటనను మార్చేసి జగన్ కుర్చీ కిందకే నీళ్ల వచ్చేలా చేశారు. ఈ పరిణామాన్ని జగన్ అసలు జీర్ణించుకోలేకపోతున్నారుట.మొత్తానికి రాగల ప్రమాదాన్ని ముందే అంచనా వేసిన జగన్ సీబీఐ విచారణతో ఈ రెండు పార్టీల నోరు టెంపరరీగా మూయించినా వారికి ఏపీలో ఎలా ప్రవేశించాలో పొలిటికల్ రూట్ దొరికేసిందని జగన్ మదనపడుతున్నట్లుగా చెబుతున్నారు. ఏపీలో ఆలయాల మీద దాడులు, రథాలు తగలబడిపోవడాలు, ఆలయాలు కూల్చివేతలు చంద్రబాబు హయాంలో కూడా జరిగాయి. కానీ నాడు ఏ మాత్రం ఆందోళన చేయడానికి సాహసించని బీజేపీ జనసేనలకు జగన్ సర్కార్ లో ఒక బలహీనత కనిపించడమే ఇంతటి ఆందోళనకూ బీజం వేసిందని అంటున్నారు.ఇక జగన్ క్రిస్టియన్ అని అంతర్వేది ఆందోళన సందర్భంగా పదే పదే మీడియా ముఖంగా జనాలలో ఫోకస్ అయ్యేలా బీజేపీ నేతలు సున్నిత విషయాన్ని తెచ్చారు. ఇదే ఇపుడు వైసీపీలో అతి పెద్ద చర్చగా ఉంది. జగన్ ఇప్పటికిపుడు తన మతాన్ని మార్చుకోలేరు. పైగా దాన్ని టార్గెట్ చేస్తూంటే ఇవాళ కాకపోయినా రేపు అయినా జనంలోకి అది పోతే అసలుకే ఎసరు వస్తుందని వైసీపీ అధినాయకత్వం భయపడుతోంది. రాజకీయాలకు మతాన్ని ముడిపెట్టి వాడడం మంచి విధానం కాకపోయినా ఇపుడు అంతా అదే చేస్తున్నారు.

దాంతో జగన్ బీజేపీ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని గట్టిగా నిర్ణయించినట్లుగా చెబుతున్నారు.ఏపీలో ప్రత్యేక హోదా కోరుతూ మరింత గట్టిగా డిమాండ్ కేంద్రం ముందు పెట్టడానికి జగన్ డిసైడ్ అయ్యారని అంటున్నారు. తన పార్టీ ఎంపీలకు ఈ విషయంలోనే జగన్ దిశానిర్దేశం చేశారని చెబుతున్నారు. బీజేపీని, మోడీని నిందు పార్లమెంట్ లో నిలదీయాలని కూడా జగన్ ఆదేశలు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. తాను చాలా పద్ధతిగా బీజేపీకి రాజ్యసభలో మద్దతు ఇవ్వడమే కాకుండా అనేక కీలక బిల్లులకు కూడా ఆమోదం తెలుపుతున్నా కూడా ఇలా ఏపీని బీజేపీ ఇలా టార్గెట్ చేయడం మీద జగన్ మండిపడుతున్నట్లుగా చెబుతున్నారు. మరి హోదా విషయంలో జగన్ కేవలం బీజేపీ దూకుడు కి చెక్ చెప్పడానికే వాడుకుంటారా, లేక దీన్ని సీరియస్ గా తీసుకుని ముందుకు సాగుతారా అన్నది చూడాలి. ఏది ఏమైనా జగన్ ఇపుడు బీజేపీని కార్నర్ చేయాలని నిర్ణయించుకోవడం ఏపీ రాజకీయాల్లో కీలకమైన మార్పుగా చూడాలి.

# ప్రతి జిల్లాలోనూ మంత్రులపై అసంతృప్తి

ఒంగోలు, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)అవును! ఇప్పుడు వైసీపీ నేతలు ప్రతి జిల్లాలోనూ మంత్రులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే, కొన్ని జిల్లాల్లో నాయకులు తమ అసంతృప్తిని బాహాటంగా వెళ్లగక్కుతుంటే.. మరికొన్ని జిల్లాల్లో మాత్రం మౌనంగా భరిస్తున్నారు. ఇదే తేడా. ఇలా.. బట్టబయలైన ఓ జిల్లా వ్యవహారం.. ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. రాజకీయంగా సీనియర్ నాయకుడు, సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడుగా గుర్తింపు సాధించిన నాయకుడు, ప్రకాశం జిల్లాకుచెందిన మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి. పార్టీలో ఈయన ఇప్పుడు మంచి హవాలో ఉన్నారు. ఆయన మాటకు ఎదురులేదనే భావన ఉంది.ఆయన కనుసన్నల్లోనే గత ఐదేళ్ల నుంచి కూడా జిల్లా వైసీపీ కార్యక్రమాలు జరుగుతున్నాయి. అదే సమయంలో పార్టీలోనూ ఆయన మాటకు తిరుగులేదు. జగన్ బాలినేనిని వాసు మామా అని పిలుస్తారు. జగన్ బాబాయ్ వైవి.సుబ్బారెడ్డి బావే బాలినేని. వాస్తవంగా చెప్పాలంటే సుబ్బారెడ్డే జగన్‌కు సొంత బాబాయ్. అయినా జగన్ బాలినేనికి ఎంత ప్రయార్టీ ఇస్తారో చెప్పక్కర్లేదు. జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి జిల్లా వైసీపీని శాసిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనకు మంత్రి పదవి దక్కింది. అయితే, ఇప్పుడు జిల్లాలో నాయకులను ఆయన పట్టించుకోవడం లేదని, తమ గోడు వినిపించుకోవడం లేదని నాయకులు వాపోతున్నారు. కేవలం కొందరికి మాత్రమే బాలినేని శ్రీనివాసరెడ్డి అందుబాటులో ఉంటున్నారని పెద్దగానే ప్రచారం జరుగుతోంది.ఇక, పార్టీలో తీవ్ర ఘర్షణలకు దారిచ్చేలా కొందరు వ్యవహరిస్తున్నా.. ఆయన మౌనంగా ఉంటున్నారని, అంతా అయిపోయిన తర్వాత.. ఏదో ఒకటి తేల్చుకుని తన వద్దకు వచ్చాక పంచాయతీ చేయాలనే కోణంలో ఉన్నారని అంటున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఇటీవల ఓ ఎమ్మెల్యే మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ని కలిశారు. సీఎంతో అప్పాయింట్‌మెంట్ ఇప్పించాలని అభ్యర్థించారు. అలాకాదు.. నీ సమస్య ఏంటో నాకు చెప్పు.. అని బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రశ్నించడంతో సదరు నాయకుడు తన సమస్యను వివరించారు. ఇంతోటి దానికి సీఎం దాకా ఎందుకు? నేనే తేల్చేస్తా.. అన్న మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తర్వాత సదరు నాయకుడికి తానే అప్పాయింట్‌మెంట్ ఇవ్వడం మానేశారు.ఈ పరిస్థితిపై ఆ ఎమ్మెల్యే తీవ్రంగా ఫైరవుతున్నారు. గతంలో వైవీ సుబ్బారెడ్డి అంతో ఇంతో తమ పనులు చేసిపెట్టేవారని, ప్రభుత్వంలో లేకపోయినా.. ఆయన ఎంపీగా ఉండి అధికారులను పురమాయించారని, ఇప్పుడు బాలినేని శ్రీనివాసరెడ్డి మాత్రం తమకే చుక్కలు చూపిస్తున్నారని సదరు ఎమ్మెల్యే బాహాటంగానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. దీంతో ఇది.. జిల్లా వ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఇక చీరాల లాంటి చోట్ల కూడా బాలినేని శ్రీనివాసరెడ్డి కరణంకు సపోర్ట్ చేస్తుండడంతో అక్కడ ఆమంచి కూడా బాలినేనిపై గుస్సాతో ఉన్నారు. మరి ఇలాంటి పరిణామాలు? ప్రతిపక్షాలకు బలం చేకూర్చవా ? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

# పుస్తకాల్లో పండుగలపై క్లారిటీ ఇచ్చిన సర్కార్

విజయవాడ, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచి మతపరమైన విషయాలు తీవ్ర వివాదాస్పదం అవుతున్నాయి. ఈసారి ఏకంగా పాఠ్యపుస్తకాల్లో మత విషయాలను హైలెట్ చేస్తూ కొందరు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం మొదలైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విద్యా శాఖ తరపున స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ ప్రతాప్ రెడ్డి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యా శాఖ ఫిర్యాదుపై ఇబ్రహీంపట్నం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాల పరిచయం కోసం అన్ని మతాల పండుగలకు సమాన ప్రాధాన్యతనిస్తూ తెలుగు వాచకంలో రెండో తరగతి నుంచి ఏడో తరగతి వరకు పాఠ్యపుస్తకాల రూపకల్పన చేశామన్నారు. పాఠ్యపుస్తకాల్లో హిందూ పండుగలు- 7, ముస్లిం పండుగలు- 2 , క్రిస్టియన్ పండుగలు- 2, సవరల పండుగ- ఒకటి చొప్పున పాఠ్యాంశాలు ఉన్నాయని తెలిపారు. మొత్తం 12 పండుగల గురించి పాఠ్యాంశాల్లో పొందుపరిచి అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. ఇందులో నుంచి ఒక్క పండుగ మాత్రమే ఎంపిక చేసి హిందూ మతానికి అన్యాయం జరుగుతున్నట్లుగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. అందుకోసమే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.పాఠ్య ప్రణాళిక సంస్కరణల్లో భాగంగా కొత్త పాఠ్యపుస్తకాలను అన్ని మతాల పండుగలు, సంప్రదాయాలు, ధర్మ మార్గం విశిష్టతను తెలియచేసేలా వీలైనంత సమగ్రంగా రూపొందించాలని భావించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, 'బెజవాడ దుర్గమ్మ తెలుగు పాఠాల నుంచి వెళ్లిపోయింది.. గుణదల కొత్తమాత వచ్చి చేరింది' అంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న దుష్ప్రచారాన్ని పాఠశాల విద్యా శాఖ సంచాలకుడు వాడ్రేవు చినవీరభద్రుడు ఖండించారు. దుర్గమ్మ పాఠ్యాంశాలను తొలగించలేదని, 6వ తరగతి తెలుగు పుస్తకంలో ఉన్నాయని స్పష్టం చేశారు. కొత్త పాఠ్యాంశాలను చేర్చడంలో భాగంగా ఇతర అంశాలను పొందుపరచినట్లు చెప్పారు.రెండో తరగతి నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థులకు తెలుగు సంస్కృతిని పరిచయం చేసే క్రమంలో వివిధ మతాల ముఖ్యమైన పండుగలను పాఠ్యపుస్తకాల్లో చేర్చినట్లు తెలిపారు. ఇందులో మొత్తం 12 పండుగల్లో హిందూ మతానికి సంబంధించిన 8 ముఖ్యమైన పండుగలు ఉన్నట్లు వివరించారు. మొదటిసారిగా గిరిజనుల పండుగను కూడా పరిచయం చేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం సవరల పండుగ, విజయనగరం సిరిమానోత్సవం, నెల్లూరు రొట్టెల పండగ, అహోబిలం పార్వేటలతో పాటు విజయవాడ, గుణదల మేరీమాత ఉత్సవాలను కూడా పరిచయం చేశామని తెలిపారు. ఇలా వివిధ మతాలు, వివిధ ప్రాంతాలకు ప్రాతినిధ్యం వహించేలా పాఠ్యపుస్తకాలను ఇంక్లూజివ్‌గా రూపొందించడం ఇదే తొలిసారి అని తెలిపారు. అయితే ఇందులో నుంచి ఒక్కటి మాత్రమే ఎంపిక చేసి హిందూ మతానికి అన్యాయం జరుగుతున్నట్లుగా ట్రోలింగ్ చేయడం దురుద్దేశంతో కూడుకున్నదని స్పష్టం చేశారు.

# కమలానికి జనసేనాని షాక్

విశాఖపట్టణం, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)భారతీయ జనతా పార్టీకి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఊహించని షాకివ్వబోతున్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతుగా రంగంలోకి దిగబోతున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు గట్టి పట్టుదలతో ఉన్న విషయం తెలిసిందే. ఈ మేరకు పలు వేదికలపై తేల్చి చెప్పింది. ఈ క్రమంలో బీజేపీ మిత్రపక్షంగా ఉన్న జనసేన పార్టీ ఝలక్ ఇచ్చింది.విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి మద్దతుగా వచ్చే నెలలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి కార్మిక సంఘాలతో సమావేశం కానున్నట్లు పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన సమయం ఆసన్నమైందనీ, తెలుగు ప్రజల ఆత్మాభిమానం దెబ్బతినకుండా మన ప్రాంతానికి నష్టం కలిగించకుండా ప్రతి ఒక్కరూ సమష్టిగా పోరాటం చేయాలని కోరారు. ఈ ప్రాంతానికి మేలు చేయాలన్న కోరిక పవన్ కళ్యాణ్‌కు బలంగా ఉందన్నారు.ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా మంగళవారంలో నాదెండ్ల మనోహర్ విశాఖపట్నంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. విశాఖ ప్రాంతం ప్రజలు ఎప్పటి నుంచో ఘనంగా చెప్పుకునే అంశం విశాఖ స్టీల్ ప్లాంట్ అని, గతంలో 32 మంది బలిదానాలతో మొదలైన ఉద్యమం ఆ తర్వాత ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని మనమంతా గర్వపడే స్థాయిలో ఆ రోజు ఈ ప్రాంతంలో వేల మందికి ఉపాధి కల్పిస్తోందన్నారు. ఇది మన చరిత్రతో ముడిపడిన అంశంగా మారిపోయిందన్నారు.

# కొత్త ఛైర్మన్లు వీళ్లేనా

విజయవాడ, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)పీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించింది. 13 జెడ్పీ స్థానాలతో పాటూ అన్ని జిల్లాల్లో ఎంపీపీలను దక్కించుకుంది. ఎస్ఈసీ కూడా జెడ్పీటీసీ ఛైర్మన్, ఎంపీపీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 24న ఎంపీపీ ఎన్నిక జరగనుండగా.. జెడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికలు 25న జరగనున్నాయి. వైసీపీ అధిష్టానం కూడా జెడ్పీ ఛైర్మన్ అభ్యర్థుల జాబితాను దాదాపుగా సిద్ధం చేసిందట. జిల్లాలవారీగా రాజకీయ, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని అభ్యర్థుల లిస్ట్ రెడీ చేసుకుందట. రెండు, మూడు రోజుల్లోనే ఈ జాబితాను విడుదల చేసే అవకాశం ఉంది. జిల్లాల వారీగా చూస్తే..

శ్రీకాకుళం ? పిరియా విజయ
విజయనగరం ? మజ్జి శ్రీనివాసరావు
విశాఖపట్నం ? శివరత్నం
తూర్పు గోదావరి ? విప్పర్తి వేణుగోపాల్
పశ్చిమగోదావరి ? కవురు శ్రీనివాస్
కృష్ణా జిల్లా ? ఉప్పాళ్ల హారిక
గుంటూరు ? క్రిస్టినా
ప్రకాశం జిల్లా ? బూచేపల్లి వెంకాయమ్మ
నెల్లూరు ? ఆనం అరుణమ్మ
కడప ? ఆకేపాటి అమర్నాథరెడ్డి
కర్నూలు ? రామ సుబ్బారెడ్డి (తాత్కాలికం)
చిత్తూరులో ? వి. శ్రీనివాసులు
అనంతపురం- గిరిజ

జిల్లాల వారీగా వీరి పేర్లు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ జాబితాను వైసీపీ అధిష్టానం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఒకటి రెండు మార్పులు జరిగే అవకాశం ఉందంటున్నారు.

# మరో తాడిపత్రిగా... ఆచంట

ఏలూరు, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)మొన్న జరిగిన పరిషత్ ఎన్నికల్లో వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఘన విజయం సాధించింది. అయితే కొన్ని చోట్ల పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆచంటలో వైసీపీ పరాజయం పాలయింది. అయితే ఈ ఎంపీపీని దక్కించుకోవడానికి చెరుకువాడ శ్రీరంగనాధరాజు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆచంటలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణను దొడ్డిదారిన దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు.మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ప్రాతనిధ్యం వహిస్తున్న ఆచంట నియోజకవర్గంలో మొత్తం 17 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఇందులో కేవలం ఆరింటిలో మాత్రమే వైసీపీ విజయం సాధించింది. జడ్పీటీసీ కూడా టీడీపీ దక్కించుకుంది. 17 ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ ఏడు స్థానాల్లో, జనసేన నాలుగు స్థానాల్లో విజయం సాధించాయి. ఇక్కడ ఎంపీపీని దక్కించుకోవాలంటే తొమ్మిది ఎంపీటీసీ సభ్యుల మద్దతు అవసరం.కానీ ఇక్కడ మాజీ మంత్రి పితాని సత్యనారాయణ జనసేన ఎంపీటీసీలతో కలసి ఆచంట ఎంపీపీని కై?వసం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇందుకోసం జనసేన అగ్రనేతలను కూడా సంప్రదించారు. ఈ నెల 24వ తేదీన ఎంపీపీ ఎన్నిక జరగనుంది. దీంతో టీడీపీ, జనసేన ఎంపీటీసీలను క్యాంప్ లకు తరలించారు. క్యాంప్ ల నుంచి రప్పించి ఆచంట ఎంపీపీని దక్కించుకోవాలని మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు ప్రయత్నిస్తున్నారు.కానీ జనసేన గుర్తు మీద గెలిచిన నలుగురు ఎంపీపీలు ససేమిరా అంటున్నారు. మంత్రి మాత్రం పట్టుదలకు పోతున్నారు. ఇది తనకు ప్రిస్టేజ్ అని, జనసేన సభ్యుల మద్దతు కోసం తీవ్రంగానే ప్రయత్నాలు చేస్తున్నారు.

# ఏవోబీలో ఎదురుకాల్పులు

విశాఖపట్నం ఆంధ్రా ఒడిశా సరిహద్దు ఏవోబీలో ఏ.ఓ.బి.లో పోలీసులు మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. మావోయిస్టులు కాల్పులు జరుపుతూ తప్పించుకున్నారు. మావోయిస్టులు జరుపుతున్న వారోత్సవాల నేపథ్యంలో కూంబింగ్ చేస్తున్న పోలీసు బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. మావోయిస్టుల కదలికలపై పోలీసులు సమాచారం అందింది. మల్కన్గిరి జిల్లా తులసిపాడు అటవీప్రాంతంలో ఈ ఘటన జరిగింది. కాల్పుల నేపథ్యంలో తులసిపాడు అటవీప్రాంతానికి డీవీఎఫ్, ఎస్వోజీ బలగాలు చేరుకున్నాయి. పరారైన మావోయిస్టుల కోసం కొనసాగుతున్న కూంబింగ్ ముమ్మరం చేసారు.

# ఏపిలో పొలిటికల్ మోనార్కిజం

విజయవాడ, సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో అధికారపార్టీ అన్ని స్థాయుల్లోనూ తన పెత్తనాన్ని ఖరారు చేసుకుంది. తాజాగా వెలువడిన ఎంపీటీసీ, జెడ్పీటీసీలతో మరోసారి తనకు ఎదురులేదని చాటి చెప్పింది. ప్రతిపక్షాల పరాజయం పరిపూర్ణమని తేలిపోయింది. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రతిపక్షమే కనిపించని రీతిలో ఏకైక పక్షంగా వైసీపీ 90 శాతం పైగా స్థానాలను కైవసం చేసుకుంది. కొన్ని మండల పరిషత్తుల్లో అసలు ప్రతిపక్షమే ఉండదు. మరికొన్ని చోట్ల నామమాత్రంగా ఉండబోతోంది. అటు ఉత్తరాంధ్ర మొదలు ఇటు రాయలసీమ వరకూ అదే ధోరణి. అయిదునెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వెలువడిన ఫలితాలు అధికారపార్టీ వైసీపీకి సంబరమే. స్థానిక పాలనకు కీలకమైన మండలాలు, జిల్లా పరిషత్తుల్లో ప్రతిపక్షాలు కనుమరుగవ్వడం ప్రజాస్వామ్యానికి విషాదమే. అయితే ప్రతిపక్షాలు ఈ పరాభవానికి ముందుగానే సిద్ధమయ్యాయి. క్షేత్రస్థాయిలో ట్రెండ్ ను గమనించి ఎన్నికల ఘట్టం చివరి దశలో తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నామని తెలుగుదేశం ప్రకటించింది. అయితే అభ్యర్థులు మాత్రం బరిలోనే నిలిచారు. అధికారికంగా టీడీపీ పోటీలోనే ఉన్నట్లు చెప్పాలి. చాలా చోట్ల అభ్యర్థులు ప్రచారం కూడా చేశారు. అయితే అనూహ్యంగా తీవ్రమైన చేదు ఫలితం మిగిలింది. పదివేల పైచిలుకు ఎంపిటీసీలు, 550 వరకూ జెడ్పీటీసీలు కొత్తగా కొలువుతీరబోతున్నారు. అక్కడక్కడా మినహాయిస్తే దాదాపు అందరూ వైసీపీ అభ్యర్థులే. గతంలో ఎన్నడూ స్థానిక ఎన్నికల్లో ఈ రకమైన ఫలితాలు రాలేదు. తాను అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ గతంలో అనేక సార్లు స్థానిక ఎన్నికల్లో బలమైన ఆధిక్యం కనబరిచింది. కానీ అప్పట్లో కాంగ్రెసు అభ్యర్థులు గట్టి పోటీనే ఇచ్చేవారు. కనీసం 30శాతం వరకూ సీట్లు ప్రతిపక్షాల చేతిలో ఉంటుండేవి. చర్చలకు, వాదోపవాదాలకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఫలితాలను బట్టి చూస్తుంటే స్థానిక సంస్థలు ప్రభుత్వానికి వత్తాసు పలికే వ్యవస్థగా రూపుదిద్దుకునే ప్రమాదం కనిపిస్తోంది. నిధుల వినియోగం, పనుల్లో జవాబుదారీతనంపై నిఘా కొరవడుతుంది. అధికారపార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నమాట వాస్తవమే. కానీ ప్రతిపక్షాలు కనీసం సంఘటితంగా పోరాడి ఉండాల్సింది. మండల పరిషత్తులు, జిల్లాపరిషత్తుల్లో నూటికి 20 మందైనా ప్రతిపక్ష అభ్యర్థులు ఉండేవారు. ఈ అవకాశాన్ని ప్రతిపక్షాలు చేజేతులారా పోగొట్టుకున్నాయి.ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ స్థానిక ఎన్నికల్లో పుంజుకునే ప్రయత్నం చేయలేదు. పోటీకి ముందే చేతులెత్తేసింది. పార్టీ రహితంగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తాము చాలా చోట్ల ఆధిక్యం కనబరిచామని క్లెయిం చేసుకుంది. తీరా పార్టీ గుర్తులపై జరిగే పోటీ విషయానికొచ్చేసరికి తమ బలహీనతను బయటపెట్టుకుంది. న్యాయస్థానాల్లో వ్యాజ్యాలు, రాష్ట్రంలో కొత్తగా నియమితులైన ఎన్నికల కమిషనర్ తో వివాదాలతో లబ్ధి పొందాలని చూసింది. ఈ పోరాటం ఒక రకంగా వికటించింది. పార్టీ అధిష్ఠానం దిగువ స్తాయి క్యాడర్ కు నైతికంగా మద్దతు ఇవ్వలేకపోయింది. అందుకే పార్టీ కార్యకర్తలు, దిగువశ్రేణి నాయకులు ఎన్నికలు తమకు సంబంధించిన వ్యవహారంగా బావించలేదు. దీంతో వైసీపీ అభ్యర్థుల హవా తప్ప మరే గాలి ఎన్నికల్లో కనిపించలేదు. రాజకీయంగా స్థిరపడటానికి పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు చాలా కీలకం. గ్రౌండ్ లెవెల్ లో వీరి పనితీరు పార్టీకి మంచి గుర్తింపు తెచ్చి పెడుతుంది. శాసనసభ ఎన్నికల వంటివాటికి బలమైన క్యాడర్ గానూ ఎంపీటీసీ, జెడ్పీటీసీలు ఉపయోగపడతారు. అధికారిక హోదాల రీత్యా ప్రజలకు సన్నిహితంగా మెలుగుతూ పనులు చేసే పెట్టే వీలుంటుంది. వైసీపీ పార్టీ నిర్మాణానికి తాజా గా లభించిన పలితాలు దోహదపడతాయి. మరోవైపు టీడీపీకి మంచి నిర్మాణం ఉన్నప్పటికీ స్థానిక ఎన్నికల్లో దానిని ఉపయోగించుకోలేక పోయింది. దీని ప్రభావం వచ్చే శాసనసభ ఎన్నికల వరకూ కొనసాగుతుంది. శాసనసభ ఎన్నికల ఫలితాలు, గడచిన నలభై సంవత్సరాలుగా రాష్ట రాజకీయాలలో వెలువడిన వివిధ ఎన్నికల ను బేరీజు వేసి చూస్తే తాజా ఫలితాలు భిన్నంగా కనిపిస్తున్నాయి. గ్రౌండ్ లెవెల్ వాస్తవాలతో ఏమాత్రం సంబంధం లేకుండా రిజల్ట్స్ లో అధికారపార్టీ వైసీపీ విజయాలు నమోదు చేసింది. రాష్ట్రంలో అధికారంలో ఉన్నపార్టీకి అనుకూలంగానే స్థానిక సంస్థల పలితాలు వస్తుంటాయి. కానీ ప్రతిపక్షం పాత్ర కూడా ఎంతోకొంత అవసరం. దానివల్ల చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ కు అవకాశం ఉంటుంది. కేంద్రం నుంచి వచ్చే నిధులు, రాష్ట్రం నుంచి రావాల్సిన బకాయిల వంటి అంశాలపై నిలదీయడానికి జెడ్పీ,ఎంపీపీలు ప్రధాన వేదికలు. అంతిమంగా అధికారపార్టీ అనుకున్నదే జరుగుతుంది. కానీ ప్రశ్నించే గొంతులు ఉండటం వల్ల మీడియాలోనూ, ప్రజల్లోనూ చర్చ జరుగుతుంది. దానివల్ల గ్రామాలకు, మండలాలకు, జిల్లాలకు మేలు చేకూరుతుంది. తాజా ఫలితాలతో స్థానిక సంస్థలు సైతం తప్పుదారి పట్టినా అడిగే నాథుడు ఉండకపోవచ్చు. అటు వంటి సందర్భాల్లో అధికారపార్టీకే దీర్ఘకాలంలో నష్టం వాటిల్లుతుంది. ఎప్పటికప్పుడు దిద్దుబాటు చేసుకునే మార్గదర్శకత్వాన్ని వైసీపీ కోల్పోయింది. ఏదేమైనా ఈ పలితాలు గ్రౌండ్ లెవెల్ లో బలాబలాలకు అతికినట్లు సరిపోతాయని చెప్పలేం.

## పోలీసుల నిఘాలో ఏవీబీ

విశాఖ పట్నం సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)మావోయిస్టుల ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా జి.మాడుగుల సర్కిల్ పోలీసులు ఏజెన్సీ ప్రాంతంలో విస్తృతంగా తనిఖీలు జరుపుతున్నారు. బుధవారం ఏ ఓ పి నుర్మతి అవుట్ పోస్ట్, జీకే వీధి మండలం పెదవలస అవుట్ పోస్ట్ దగ్గర, లక్కవరపుకోట ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్కరి వివరాలు, ఆధారాలు సేకరించారుఏవోబీలో దగ్గరలో ఉన్న పరిసర ప్రాంతాలు కూడా తనిఖీ చేస్తూ ఊర్లో కొత్త వాళ్ళు వస్తే వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని అన్నారు. కల్వర్టులు, డ్రైనేజీలు, బ్రిడ్జిలను బాంబు డిస్పోజల్, డాగ్ ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేసారు. డ్రోన్ కెమెరా ద్వారా ఏవోబీని జల్లెడ పడుతున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు.

## ఏటీఎం కేంద్రాలలో అపరిచితవ్యక్తులకు ఎటిఎం కార్డులు, ఎటిఎం పిన్ నెంబర్లు ఇవ్వద్దు

**కార్డులు మార్చి డబ్బులు దొంగలిస్తున్నారు..... జాగ్రత్త**

**వృద్ధులను, చదువురాని వారిని ఎక్కువగా మోసం చేస్తున్నారు**

కర్నూలు సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)ఈ మధ్య కాలంలో ఏటీఎం కేంద్రాలలో ఎటిఎం కార్డులు మార్చే మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నగదు కోసం కు ఎటిఎం కేంద్రాలకు వెళ్ళే వృద్ధులు, చదువురాని వారు డబ్బులు డ్రా చేయడం తెలియనప్పుడు అపరిచిత వ్యక్తులను నమ్మి వారిని ఎటిఎం కార్డుల నుండి డబ్బులు డ్రా చేసి ఇమ్మని అడిగిన సంధర్భాలలో వారు ఒరిజినల్ కార్డులు తిరిగి ఇవ్వకుండా నకిలి కార్డులు ఇచ్చి ఓరిజినల్ ఏటీఎం కార్డులను ని తీసుకొని దాని ద్వారా ఖాతా లోని మొత్తం డబ్బును డ్రా చేసుకుంటారు. అపరిచిత వ్యక్తులకు మీ ఎటిఎం కార్డు గాని, ఎటిఎం పిన్ నెంబర్ గాని ఇచ్చి డబ్బులు డ్రా చేయమని అడగవద్దు. ఏదైనా అవసరమైన పరిస్థితులలో డబ్బులు డ్రా చేసుకోవడం తెలియకపోతే అక్కడ ఉన్న సెక్యూరిటి గార్డు సహాయం తీసుకోవాలి. అపరిచిత వ్యక్తులకు ఎటిఎం కార్డులు ఇచ్చి మోసపోవద్దు. గత రెండు నెలలో ఏటిఎం కార్డులు మార్చి నగదు అపహరించిన కేసులు ఏడు. ఎక్కువగా చదువురాని వారు ఈ మోసానికి గురి అవుతుండడం వలన, దీనిని చదివిన వారు మీకు పరిచయం ఉన్న వయస్సు మళ్ళిన వారికి, చదువురాని వారికి ఈ విషయంలో అవగాహన కలిగించాలని పోలీసులు విజ్ఞప్తి చేసారు. .

## అన్నివిధాల దోపిడిలు

గుంటూరు సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు బుధవారం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి తన తండ్రి టైంలో చేసిన దోపిడీని అనుభవంగా ఉపయోగించుకోని రాష్ట్రాన్ని దోచుకొంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న వనరులను 2లక్షల కోట్ల రూపాయలు దండుకున్నాడని ఆరోపించారు. 17,300 కోట్లు ఎటు వెళ్లాయో జగన్మోహన్ రెడ్డి చెప్పాలా...? ఐదు సంవత్సరాలకే నువ్వు ముఖ్యమంత్రివి శాశ్వత ముఖ్యమంత్రి కాదూ. గగ్గవరం పోర్టులోనే 17,500 కోట్లు అవినీతి జరిగింది. 30 లక్షల కోట్ల విలువచేసే వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మాలని చూస్తున్నారు. స్టీల్ ప్లాంట్ అమ్మితే రాష్ట్రం ప్రభుత్వం తీసుకోంటుదనే మాటమీద సీఎం నిలబడాలి.కృష్ణ పట్నం, కాకినాడ, వైజాగ్ ఇలా అన్ని పోర్టులు తన అనుచరులకు ఇచ్చి అవినీతికి పాల్పడుతున్నారు. రాష్ట్రంలో పేదలకు గృహ నిర్మాణ పథకం చేపట్టింది ఎన్టీఆర్, చంద్రబాబే. అలాంటి పేదలపై కూడా 18వేల కోట్లు వసూలు చేయడానికి ప్రభుత్వం సిద్ధం అయిందని విమర్శించారు. మీ పాదయాత్ర లో చెప్పిన ఉచిత పవర్ హామీ ఏమైంది. గతంలో కరెంట్ బిల్లు 2వందలు వస్తే నేడు 6 వందలు వస్తుంది. 12వేల కోట్ల పవర్ ట్యారిఫ్ తో ఇప్పటికే పేదలపై బారం వేశారు. మరో 6వేల కోట్లు పెంచడానికి ప్రభుత్వం సిద్ధం అయింది. బడుగులు, పేదల దగ్గర రావలసిన బాకీలు మీరే వసూలు చేసుకోవాలని పవర్ సంస్థలకు అధికారం ఇస్తూ జీవో ఇచ్చారు. మద్రాస్ కి చెందిన శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఇసుక దోపిడీ చేస్తున్నారు. లిక్కర్ బాటిల్ ద్వారా 2వేల కోట్లు సీఎం కి వెళుతున్నాయి. మైనింగ్ లో 2500కోట్లు సీఎం కి వెళుతున్నాయి. పేదలపై పెట్రోల్, డీజిల్ బాదుడు కొనసాగుతోంది. ఎస్సీ సబ్ ప్లాన్ లో టీడీపీ హయాంలో 34,000 పెడితే ఈ ప్రభుత్వం లో రూపాయి లేదు. రాజ్యాంగ ఉల్లంఘన చేసి ఎస్సీ హక్కులు కాలరాసిన ఈ ముఖ్యమంత్రిని కోర్టుకు లాగుతామని అన్నారు.

## నెరవాటి బ్యాడ్మింటన్ అకాడమీని సందర్శించిన ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి, చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

నంద్యాల సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్ బుధవారం నాడు నంద్యాల పట్టణంలోని నెరవాటి బ్యాడ్మింటన్ అకాడమీని సందర్శించిన ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి మరియు షాప్ చైర్మన్ బై రెడ్డి సిద్ధార్థ్ రెడ్డి సందర్శించి మూడు జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోస్టర్లు విడుదల చేయడం జరిగిందన్నారు .ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బ్యాడ్మింటన్ స్టేడియం నిర్మించడం చాలా గొప్ప విషయం అని క్రీడాకారులు అందరూ ఇటువంటి సేవలు వినియోగించుకోవాలని కోరారు. షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని నెరవాటి బ్యాడ్మింటన్ అకాడమి వారు నిర్వహిస్తున్న టోర్నమెంట్ సక్సెస్ కావాలని ఆకాంక్షించారు.

## డ్రగ్స్ కేసులో వైసీపీ ఉలిక్కి పడుతోంది



విజయవాడ సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)వైసీపీ రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రాన్ని నేరస్థుల అడ్డాగా మార్చింది. వైసీపీ రెండున్నర సంవత్సరాల్లో రాష్ట్రాన్ని నేరస్థుల అడ్డాగా మార్చిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడారు. పట్టుబడిన రూ. 72 వేల కోట్ల హెరాయిన్ స్మగ్లింగ్ బిగ్ బాస్ ఎవరంటే వైసీపీ భుజాలు తడుముకుంటోంది. డ్రగ్స్ కేసులో వైకాపా ఎందుకు ఉలిక్కి పడుతోంది. ఏపీ పోలీసులు ఈ డ్రగ్స్ పై ఎందుకు విచారణ చేయటంలేదు? రాష్ట్రంలో మైనింగ్ మాఫియాలా డ్రగ్స్ సిండికేట్ అయింది. డైరెక్టర్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు వైసీపీ తాట తీస్తారు. తాడేపల్లి నుంచి ఢిల్లీలో డీఆర్ఐ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ట్రాన్స్ ఫర్స్, ప్రమోషన్స్ కోసం ఏపీ పోలీసులు తాడేపల్లి ఆదేశాలను పాటిస్తూ వ్యవస్థల్ని నాశనం చేస్తున్నారు. పట్టుబడిన 72 వేల కోట్ల హెరాయిన్ ఏమైంది?. వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని నేరాంధ్రప్రదేశ్ గా మార్చారు. నిర్వాహక బిగ్ బాస్ తాడేపల్లిలో ఎక్కడున్నాడో త్వరలో తేలుతుంది. ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఏపీ డ్రగ్స్ వ్యవహారమంతా తెలుసు. దేశంలో ఎప్పుడు, ఎక్కడా జరగని విధంగా వైసీపీ మద్దతుతో పెద్ద ఎత్తున డ్రగ్స్ వ్యవహారం ఏపీలో నడుస్తోంది. అఫ్ఘనిస్తాన్ నుంచి దేశంలోకి హెరాయిన్ ని తీసుకొస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ పెద్దల సహకారంతో దిగుమతి అవుతోంది. డిఆర్ఐ 9 వేల కోట్ల హెరాయిన్ ని సీజ్ చేయడం వాస్తవం కాదా? ఈ కంపెనీ ఎక్కడుంది? విజయవాడలోని సత్యనారాయణపురంలో ఉంది. సుధాకర్ అనే ఎమ్మెల్యే బంధువు ఈ కంపెనీని నడుపుతున్నాడు. వైసీపీ కి చెందిన వ్యక్తి ఈ కంపెనీని పెట్టడం వాస్తవం కాదా? ఇదంతా వైసీపీ ప్రభుత్వ మద్దతుతోనే జరుగుతోంది. మంత్రి పేర్ని నాని గుమ్మడికాయల దొంగ అంటే బుజాలు తడుముకుంటున్నాడు. వైసీపీకి సంబంధం లేదంటున్నారు. డ్రగ్స్ కేసులో వైసీపీ ఉలిక్కి పడుతోంది. రాష్ట్రాన్ని నేరస్థుల అడ్డాగా మార్చారు. రాష్ట్రంలో ఏం జరుగుతోంది? దీనిపై సమగ్ర విచారణ జరగాలి. తెలుగుదేశం పార్టీ డీఆర్ఐ వారికి లేఖ రాస్తుంది. రాష్ట్రంలోని పోలీసులపై, పోలీసు బాస్ పై విచారణ చేయాలి. వైసీపీ ప్రభుత్వం, పోలీసుల కనుసన్నల్లోనే ఈ డ్రగ్స్ దందా జరుగుతోంది. ఇంత పెద్ద ఎత్తున డ్రగ్స్ దందా జరుగుతుంటే నిరోధించాల్సిన బాధ్యత పోలీసులది. వారు డబ్బుల కోసం, ప్రమోషన్ల కు కక్కుర్తిపడి దేశ భద్రతకు భంగం కలిగిస్తున్నారు. డీఆర్ఐ అధికారులు సమగ్ర విచారణ లోతుగా చేయాలి. ఈ కేసు మూలాలు తేల్చాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును తేలిగ్గా తీసుకుంటోంది. వైసీపీ నాయకులు డ్రగ్స్ కేసు విషయంలో తేలు కుట్టిన దొంగల్లా ఉన్నారు. ప్రజల, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవాలని చూస్తున్నారు. దేశ భద్రతకు భంగం కలిగిస్తున్నారు. విజయవాడని డ్రగ్ హబ్ గా మార్చి దేశంలోని 29 రాష్ట్రాలకి డ్రగ్స్ సరఫరా చేయాలనుకునే నాయకుల పన్నాగానికి కట్ట పడనుందని భావిస్తున్నాం. టీడీపీ తరపున ఢిల్లీ వెళ్లి ఇక్కడ జరుగుతున్న అక్రమాల గురించి సంబంధిత అధికారులకు తెలుపుతామని అన్నారు.

## తమ్ముడి హత్యకేసులో అన్నే నిందితుడు

నెల్లూరు సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్) ముత్యాల పాడు లో ఈ నెల 13 అర్ధరాత్రి దయాకర్ అనే యువకుని హత్యకేసును గూడూరు పోలీసులు చేధించారు. కేసులో పిర్యాదు దారు అయిన సొంత అన్నే ముద్దాయిగా తేల్చారు. ఎటువంటి ఆధారాలు లేని చోట కొన్ని సూక్ష్మ ఆధారాలతో కేసును ఛేదించిన గూడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కి మేరిటోరియస్ సర్వీస్ ఎంట్రీ సిఫార్సు చేసారు. కోట మండలం లక్ష్మక్క కండ్రిగ గ్రామానికి చెందిన కాకు దయాకర్ కు ధనుంజయ అనే ఒక అన్న, ఒక చెల్లి ఉన్నారు, పదిహేను సంవత్సరాల క్రితమే దయాకర్ ను పని నిమిత్తం హైదరాబాద్ లోని ఒక ఫార్మా కంపెనీలో ఉద్యోగానికి దయాకర్ అన్న ధనుంజయ పంపాడు. కొన్ని రోజులు తర్వాత ఉద్యోగం మానేసి దొంగతనాలకు అలవాటు పడిన దయాకర్ తాళాలు వేసిన ఇళ్ళలో చోరీలు చేస్తూ వుండడం తో హైదరాబాద్ లో అనేక కేసుల్లో ముద్దాయిగా ఉన్నాడు. దొంగతనం జరిగిన ప్రతిసారి హైదరాబాద్ పోలీసులు లక్ష్మక్క కండ్రిగ అయిన తమ గ్రామంలో తమ ఇంటి కి వచ్చి విచారణ చేస్తూ వుండడం అవమానంగా భావించిచాడు. తరువాత దయాకర్ చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యాక దయాకర్ ని నెల్లూరులో వాళ్ళ బంధువులు ఇంటిదగ్గర ఉంచాడు. కొన్ని రోజుల తర్వాత తిరిగి దొంగతనాలకు పాల్పడుతుండడం, ఈ లోపు వాళ్ళ చెల్లెలుకు పెళ్ళి కుదరడం ఈ క్రమంలోనే తమ్ముడు దయాకర్ తో అన్న ధనుంజయ చెల్లి పెళ్ళి కుదిరింది ప్రవర్తన మార్చుకోమని చెప్పాడు. దయాకర్ కొన్ని ఇబ్బందికరమైన మాటలు అనడంతో ఇంక దయాకర్ మారడు అనే ఉద్దేశ్యంతో ఎలాగైనా తమ్ముడిని కడ తీర్చాలి అనే ఉద్దేశముతో ముత్యలపాడు లోని బంధువుల ఇంటికి పంపి ఆరోజు రాత్రి హత్యకు పధకం రచించాడు. పధకం ప్రకారం మూత్యాలపాడు కు కారు లో వచ్చి కారును వూరి చివర మాతమ్మ గుడిదగ్గర వుంచాడు. మేడమీద నిద్ర పోతున్న దయాకర్ ని కత్తితో మెడ మీద పొడిచినట్టు,తర్వాత హత్యా సమయంలో హత్యకు ఉ పయోగించిన కత్తి, వేసుకున్న దుస్తులు తీసి ఇంట్లోని బ్యాగ్ లో పెట్టి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉదయం ఏమి తెలియని వాడిలా తన తమ్ముడుని ఎవరో చంపేశారని చిల్లకూరు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. దగ్గరుండి తమ్ముడి పోస్టుమార్టం పూర్తి చేశాక కర్మక్రతువులు నిర్వహించడం చేశాడు. పోలీసులు ఇంట్లో వారిని విచారిస్తున్న సమయంలో ఒకరికి ఒకరు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం కలిగి ధనుంజయ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండడం తో అనుమానంతో లోతుగా విచారణ చేయగా ముద్దాయి విచారణలో హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియచేశాడని డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి తెలియచేశారు.ధనుంజయ తో పాటు బావమరిది ముద్దాయిగా మారిన వైనం హత్య తర్వాత ఉదయం గూడూరు లో తమ్ముడి పోస్ట్ మార్టం దగ్గర వున్న ధనుంజయ పోలీసులు డాగ్ స్క్వాడ్ తీసుకు వస్తే దొరికి పోతానేమో అనుకుని శ్రీ కాళహస్తిలోని తన బావ మరిది అయిన ప్రదీప్ కి ఫోన్ చేసి కత్తిని, బట్టల్ని ఇంట్లో పెట్టి ఉన్నానని వాటిని పక్కనే వున్న కాలువలో పడేయమని చెప్పడంతో ప్రదీప్ లక్ష్మమ్మ కండ్రిగ కి వెళ్లి ఆ వస్తువులను కాలవలో పడేసాడు. దాంతో ప్రదీప్ కూడా ముద్దాయిగా మారాడు. ముద్దాయిల ను మంగళవారం రాత్రి బోదనం టోల్ ప్లాజా వద్ద అరెస్ట్ చేసారు.

## రేషన్ పంపిణిలో సర్వర్ సమస్యను పరిష్కరించండి

నందికొట్కూరు. సెప్టెంబర్ 22రేషన్ షాపుల్లో ఈ పాస్ యంత్రాలు మళ్లీ మొరాయిస్తున్నాయని, సర్వర్ సమస్యతో ఈ పోస్ యంత్రాలు పనిచేయకపోవడంతో డీలర్లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నందికొట్కూరు తహశీల్దార్ రాజశేఖర్ బాబు కు రేషన్ డీలర్లు విన్నించుకున్నారు. బుధవారం తహశీల్దార్ రాజశేఖర్ బాబుకు డీలర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎండీయూల పంపిణీ సమయంలో సర్వర్ వేగంగా పనిచేసి రేషన్ పంపిణీ సమయంలోనే సర్వర్ సమస్య ఎందుకొస్తుందని డీలర్లు ప్రశ్నించారు. సర్వర్ సమస్య ప్రతి నెల వస్తుందని డీలర్లు ఆవేదన చెందుతున్నారు. రేషన్ కోసం జనాలు పెద్ద సంఖ్యలో క్యూలు కట్టడం ,గంటల తరబడి సర్వర్ పనిచేయకపోవడంతో జనాలు డీలర్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వృద్ధులు,మహిళలు,వికలాంగులు రేషన్ దుకాణాల వద్ద చాల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సర్వర్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సర్వర్ పనిచేస్తే రేషన్ నూటికి నూరుశాతం గడువులోగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. డీలర్ల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తహశీల్దార్ రాజశేఖర్ బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్లు సంఘం నాయకులు చాంద్ భాష, వలి భాష, ప్రాన్సిస్, శ్రీనివాసులు, రాముడు,సత్యం, రామ కొండారెడ్డి, సద్దాం హుస్సేన్, సత్యమయ్య,వివిధ గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికల్లో ఘర్షణ

కడప కడప జిల్లా కమలాపురం నియోజకవర్గంలో అయితే స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. పెద్ద చెప్పలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాకమిటి ఎన్నికలలో వైసీపీ, నాయకులు గొడవపడ్డారు. టీడీపీ నాయకులు డబ్బులు పంచుతున్నారనే అనుమానంతో వైసీపీకి చెందిన నాయకులు దాడి చేశారు. విద్యార్థుల తల్లదండ్రులతో మాట్లాడుతున్నానని చెబుతున్నా?. వినిపించుకోకుండా దాడి చేశారు.

## చోరీలకు పాల్పడుతున్న యువకున్ని పట్టుకున్న గ్రామస్తులు

**చిల్లకూరు పోలీసులు రంగప్రవేశం**

**అనుమానితుడు ని స్టేషన్ కి తరలింపు**

నెల్లూరు సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం పారిచెర్లవారిపాలెం లో చోరీలకు పాల్పడుతున్నాడన్న అనుమానంతో ఓ యువకుడికి గ్రామస్థులు దేహశుద్ధి చేసిన ఘటన చోటుచేసుకుంది. గత రాత్రి ఓ ఇంట్లో చొరబడి చోరీకి ప్రయత్నించగా ఆ ఇంటి యజమాని ఆ యువకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆ ఇంటి యజమాని గాయాలయ్యాయి. ఎట్టకేలకు అనుమానాస్పదంగా ఉన్న యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఇటీవల కాలంలో గ్రామంలో వరుస చోరీలు చోటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ గ్రామానికి చెందిన ఓ దుకాణం లో ఇటీవల చోరీ జరిగి సెల్ ఫోను నగదు కూడా చోరీకి గురైంది. యువకుడికి దేహశుద్ధి చేసిన విషయం పోలీసులకు సమాచారం అందడంతో ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన యువకుడు మరో ముగ్గురు యువకుల పేర్లు కూడా చోరీలకు పాల్పడే వారి జాబితాలో పోలీసులకు చెప్పినట్లు సమాచారం.

## బందరు జడ్పీ చైర్మన్ పీఠం ఎవరికి

మచిలీపట్నం సెప్టెంబర్ 22, (న్యూస్ పల్స్)నిన్న మొన్నటి వరకు కృష్ణా జిల్లా పరిషత్ చైర్మన్ పీఠం నా దేనన్న ఉప్పాల కుటుంబం ఒక్కసారిగా నిర్ఘాంతపోయింది. పరిషత్ ఎన్నికల ఫలితాలు వెలువడిని తరువాత తాజాగా చైర్మన్ పీఠం కోసం దుట్టా కుటుంబం తెర మీదకు వచ్చింది. గన్నవరం నియోజకవర్గానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు డా. దుట్టా రామచంద్రరావు కుమార్తె దుట్టా సీతామహాలక్ష్మి పేరు అనూహ్యంగా తెర మీదకు వచ్చింది. ఉంగుటూరు జడ్పీటీసీగా ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెడన నియోజకవర్గానికి చెందిన మరో సీనియర్ నేత, మాజీ డీసీఎంఎస్ నా చైర్మన్ ఉప్పాల రాంప్రసాద్ కోడలు ఉప్పాల హారిక గుడ్లవల్లేరు జడ్పీటీసీగా విజయం సాధించారు. తొలి నుండి జడ్పీ చైర్మన్ పీఠం మాదే అన్న రీతిలో ఉప్పాల కుటుంబం ఎన్నికల ప్రచారం చేసి ఘన విజయం సాధించింది. అధిష్టానం కూడా ఉప్పాల కుటుంబానికే అన్నట్టు పరోక్షంగా సంకేతాలిచ్చింది. తీరా ఫలితాలు వెలువడిన తర్వాత సీన్ రివర్స్ అయ్యింది. జనరల్ మహిళకు రిజర్వు అయిన చైర్మన్ పీఠాన్ని బీసీలకు ఇవ్వడమేమిటన్న ప్రశ్న వైసీపీ కాపు నేతల నుండి అంతర్గతంగా వినిపించింది. ఇక అంతే కాపు సామాజిక వర్గానికి చెందిన దుట్టా రామచంద్రరావు కుమార్తె సీతా మహాలక్ష్మికి చైర్మన్ పదవిని కట్టబెట్టాలని పావులు కదిపారు. ఈ విషయం తెలుసుకున్న ఉప్పాల రాంప్రసాద్ తన కోడలు హారికను తీసుకుని ఉన్న పళంగా సీఎం జగన్ ను కలిశారు. అయితే సీఎం జగన్ నుండి ఉప్పాల కుటుంబానికి స్పష్టమైన హామీ లభించలేదు. రాంప్రసాద్ సీఎం కలిసిన సందర్భంలో సీఎం జగన్ తొలిగా జడ్పీ చైర్మన్ పదవి వేరొకరికి ఇస్తానని మాట ఇచ్చానని, ఎమ్మెల్సీ పదవి తీసుకోవాలని కోరినట్టు తెలుస్తోంది. అయితే దీనికి రాంప్రసాద్ ససేమిరా అన్నారు. తమకే జడ్పీ చైర్మన్ పదవే కావాలని సీఎం వద్ద పట్టుబడినట్టు సమాచారం. చివరాకకు ఎదో ఒకటి చేద్దాంలే అన్న సమాధానం తప్ప సీఎం జగన్ నుండి ఉ ప్పాల కుటుంబానికి స్పష్టమైన హామీ లభించలేదు. జడ్పీ చైర్మన్ పదవి ఎవరికనేది అధిష్టానం నేడో రేపో అధికారికంగా ప్రకటన చేసే అవకాశం ఉంది.

## మెగా సీటీగా విశాఖ

**ఘనంగా విజెఎఫ్-సిఎంఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం**

**ఉత్సాహాభరితంగా సాగుతున్న జర్నలిస్టుల క్రీడలు**

విశాఖపట్నం, సెప్టెంబర్22 విశాఖ నగరాన్ని మెగా సీటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు చేపడుతుందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. విశాఖ పోర్టు స్టేడియంలో బుధవారం వైజాగ్ జర్నలిస్టుల ఫోరం, సిఎంఆర్,విస్జా సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్ మీడియా క్రికెట్ టోర్నీకి ఎంపీ ఎంవీవీ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు, ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ పరిపాలన రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖలో అనేక నూతన పరిశ్రమలు ఏర్పాటు అవుతాయన్నారు. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మూడు దశబ్దాలకు పైగా సభ్యులకు సంక్షేమ కార్యక్రమాలతో పాటు జర్నలిస్టుల క్రీడలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ఇతర ప్రాంతాలకు ఆదర్శనీయమన్నారు. విజెఎఫ్ చేపడుతున్న అన్ని కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. గౌరవ అతిథిలుగా హాజరైన నెడ్క్యాప్ చైర్మన్ కెకె రాజు మాట్లాడుతూ నగరాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర అత్యంత ప్రసంశనీయమన్నారు. జర్నలిస్టుల సహకారారంతోనే తామంతా రాజకీయాల్లో ఉన్నత స్థాయికి చేరుకోగలిగామన్నారు. జీవీఎంసీ స్మార్ట్ సీటీ కార్పోరేషన్ చైర్మన్ జివి వెంకటేశ్వరరావు(జీవీ) మాట్లాడుతూ నిరంతరం ప్రజా సేవలో కొనసాగే జర్నలిస్టులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మెరుగైన ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతంత లభిస్తుందన్నారు. జర్నలిస్టుల క్రీడలు పూర్తిస్థాయిలో విజయవంతం కావాలని అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజెఎఫ్ అధ్యక్షకార్యదర్శులు గంట్ల శ్రీనుబాబు, ఎస్, దుర్గారావులు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా తామ పాలకవర్గం పనిచేస్తుందన్నారు. విద్య, వైద్యంతో పాటు క్రమం తప్పకుండా రాష్ట్ర, జిల్లా స్థాయి ఇంటర్ మీడియా స్పోర్ట్స్ మీట్లు నిర్వహించిన ఘనత విజెఎఫ్కే దక్కుతుందన్నారు. దేశ వ్యాప్తంగా జర్నలిస్టుల సంక్షేమ సంఘాలకు ఆదర్శవంతంగా విజెఎఫ్ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. విజెఎఫ్ ఉపాధ్యక్షులు ఆర్.నాగరాజు పట్నాయక్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ దాడి రవికుమార్, స్పోర్ట్స్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాశంకర్బాబు, సభ్యులు దొండా గిరిబాబు, ఎంఎస్ఆర్ ప్రసాద్, ఇరోతి ఈశ్వరరావు, ,పైలా దివాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభంపోర్టు మైదానంలో ప్రారంభమైన విజెఎఫ్ క్రికెట్ పోటీలను ఎంపీ ఎంవీవీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

## అనంతగిరి లో 620 కేజీల గంజాయి పట్టివేత

విశాఖపట్నం సెప్టెంబర్22అనంతగిరి మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మంగ్లవారం 12 గంటల సమయంలో పోలీసులు తనిఖీలు నిర్వహింస్తుండగా పాడ్వవ నుంచి విశాఖపట్నం మీదుగా హర్యాన రాష్టానికి వెళ్తున్న లారీని తనిఖీలు చేయగా సుమారు 620 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు ముద్దాయి రాజు ఉత్తరప్రదేశ్ కీ వ్యక్తి అనంతగిరి ఎస్ఐ రాము సిబ్బందులతో నిందితులను పట్టుకున్నారు ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఏఎస్పీ ఆదేశాల మేరకు అరకువేలి దుంబ్రిగుడ అనంతగిరి గంజాయి తరలింపు అరికట్టేందుకు పోలీసు శాఖ ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్నము అని గంజాయి తరిలింపు ప్రోత్సహించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు యువత గంజాయి వలన జీవితాలు పాడుచేసుకోవదని గంజాయ్ తరలించే సహకరించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అనంతగిరి అనంతగిరి ఎస్ఐ రాము పోలీస్ సిబ్బంది అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ జి దేముడుబాబుమీడియా సమావేశంలో పాల్గొన్నారు

## పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా చిలకలదోన విద్యా కమిటీ చైర్మన్ రంగన్న (అలియాస్) నేపాల్



మంత్రాలయం సెప్టెంబర్ 22, (( విభారె) ) : చిలకలదోన గ్రామం పాఠశాల అభివృద్ధికి సహకరిస్తానని నూతనంగా విద్యా కమిటీ చైర్మన్ గా ఎన్నికైన రంగన్న (నేపాల్) పేర్కొన్నారు. మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామం ఎం పి యు పి స్కూల్ నూతన విద్యా కమిటీ చైర్మన్ గా రంగన్న (అలియాస్) నేపాల్, వైస్ చైర్మన్ శాంతమ్మ లి/నీ ఆనంద్ లను ఉపాధ్యాయులు సమక్షంలో విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ రంగన్న (అలియాస్) నేపాల్ మాట్లాడుతూ, రాంపురం రెడ్డి సోదరులు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ, సభ్యుడు వై ప్రదీప్ రెడ్డి,గార్ల సహకారంతో పాఠశాల అభివృద్ధి మౌలిక వసతులు కల్పించడమే కాక నాణ్యమైన విద్యను అందించటంలో ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామని, నాపై నమ్మకంతో నన్ను ఎన్నుకున్నందుకు విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు, ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మరియు నూతన విద్యా కమిటీ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా నేపాల్ ను మంత్రాలయం మండలం అధ్యక్షులు భీమిరెడ్డి, మండల ఇన్చార్జి సి,విశ్వనాథ రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో చిలకలడోన వైఎస్ఆర్సిపి గ్రామ ఇన్చార్జి నరసింహారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు కల్లుదేవకుంట సొసైటీ బ్యాంక్ చైర్మన్ వెంకటరెడ్డి, అశ్వవర్ధన్ రెడ్డి, వీరేశ్ రెడ్డి, కాంత రెడ్డి, బి రాగన్న అంజి చిన్న తాయప్ప అడవి రాముడు జగన్ గ్రామ సర్పంచ్ గుజ్జుల నాగమ్మ, ఎంపిటీసీ ఆకుల లక్ష్మి వైఎస్ఆర్సిపి ఎస్సీ కాలనీ యూత్ సభ్యులులక్ష్మన్న సోమన్న నరసప్ప దేవవరం నరసింహులు శేఖర్ ప్రసాద్ జాన్ రాజేష్ రాజు ఆదామ్ షడ్రక్ ప్రకాశం ఏలియా జోసఫ్ ప్రధానోపాధ్యాయురాలు సరళాదేవి మరియు ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నంద్యాల లో భారీ చోరీ పోలీసులకు సవాల్ విసురుతన్న దొంగలు

నంద్యాల సెప్టెంబర్ 22, (( విభారె) ) నంద్యాల పట్టణంలో పట్ట పగలే దొంగలు బీభత్సం సృష్టించు తున్నారు. మరి పోలీసులకు సవాల్ విసురుతూ ఏదోక ప్రాంతాల్లో తమ పని తాము చేసుకుంటూ పోతున్నారు. ఈ మధ్య కాలంలో వరుస హత్యలతో వనికి పోతున్న పట్టణ వాసులకు దొంగల బెడదల తో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు అని పలువురు అంటున్నారు. బుధవారం నాడు కోట వీధికి చెందిన షేక్ మజీద్ అనే పాలీష్ కాంట్రాక్టర్ ఇంట్లో 35 తులాల బంగారు. 1.88 లక్షల నగదు చోరీ జరిగిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి..

### 27న భారత్ బంద్ ను జయప్రదం చేయండి..

### సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అధ్వర్యంలో బైక్ ర్యాలీ..



నందికొట్కూరు. సెప్టెంబర్ 22 ( విభారె) .కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని,బీజేపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 27న కార్మిక సంఘాలు,ప్రజా , వామ పక్షాల పార్టీ , రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినా భారత్ బంద్ కు మద్దతుగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అధ్వర్యంలో బుధవారం నందికొట్కూరు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాని ఉద్దేశించి జిల్లా కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు డివిజన్ కార్యదర్శి గోపాలకృష్ణ ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు లు మాట్లాడుతూ దేశానికి చేటు తెచ్చు ప్రజా వ్యతిరేక విధానాలకు అడ్డు కట్ట వేయడానికి ఢిల్లీలో రైతు సంఘాల ఆధ్వర్యంలో తొమ్మిది మాసాలుగా దీక్షలు కొనసాగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాల డిమాండ్ పరిష్కరించకపోవడం హేయమైన చర్య అన్నారు. ఈ నేపథ్యంలో రైతు సంఘాలు భారత్ బంద్ పిలుపునిచ్చాయని అన్నారు. నల్ల చట్టాలను 2020 విద్యుత్ బిల్లును రద్దు చేయాలని , పంటకు మద్దతు ధర గ్యారెంటీ చేస్తూ చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువులు ధరలు తగ్గించాలనే ప్రధాన డిమాండ్ల సాధనకై భారత్ బంద్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందువల్ల రైతులు ,వ్యవసాయ కూలీలు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని బంద్ ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా వైద్యశాల వైద్యులు నాగేశ్వర రెడ్డి, ప్రజా సంఘాలు అఖిలభారత ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఎస్ బి బి ,నూర్జహాన్, లక్ష్మీదేవి ,పార్వతమ్మ ,సునీత ,విద్యార్థి సంఘం ఏ ఐ ఎస్ ఏ తాలూకా అధ్యక్ష కార్యదర్శులు రంగస్వామి, గణేష్, ప్రకాష్, ఏ ఐ కె ఎం అధ్యక్ష కార్యదర్శులు కృష్ణ, ఇజ్రాయిల్, ఆటో యూనియన్ నాయకులు ఉపేంద్ర , నాగన్న, శేఖర్, తది తరులు పాల్గొన్నారు

# వికలాంగులను రాజ్యాధికారంలో భాగస్వామ్యం చెయ్యాలి



ఎమ్మిగనూరు సెప్టెంబర్ 22, (( విభారె) ) టౌన్ లోని ఏపీ ఎన్ జివోస్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తాలుకా " వికలాంగుల హక్కుల సాధన ఐక్య సమితి" విహెచ్పిఎస్ కార్యవర్గ అధ్యక్షులు కె రామాంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి సి నాగరాజు అధ్యక్షతన జరిగిన మీటింగులో ఈ మధ్య కాలంలో జరిగిన ఎన్నికల్లో కె. తిమ్మాపురం గ్రామ పంచాయతీకి సంబంధించిన, వికలాంగురాలైన శ్రీ కె. విజయలక్ష్మి గారు ఎంపీటీసీ గా ఎన్నికైన సందర్భంగా హర్షం వ్యక్తం చేస్తూ ఆమెను సమితి సభ్యులందరూ కలిసి ఘనంగా సన్మానించారు, తదనంతరం వారు మాట్లాడుతూ వికలాంగులకు అవకాశం, ఆసరాగా ఇస్తే ఎటువంటి రంగాల్లోనైనా సత్తా చాటుతారని, వారి లోని ప్రతిభాపాటవాలు బయటపడుతాయని పేర్కొన్నారు. అందుకే ఈ సభావేదికగా వికలాంగులు కూడా సకలాంగులతో సమానమని తెలియజేసుకుంటున్నామని, ఇకనైనా మా వికలాంగుల సమస్యలు, ఇబ్బందులు పై సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీటీసీ కె విజయ్ లక్ష్మి కి సమితి కార్యవర్గం నుండి కోరారు, ఎంపీటీసీ కె విజయ్ లక్ష్మి మాట్లాడుతూ ఇది నా యొక్క విజయం కాదని, మనందరి వికలాంగుల విజయంగా నేను భావిస్తున్నానని, రాబోయే రోజుల్లో మరింత సేవలను అంధిస్తానని పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో తాలుకా ప్రధాన కార్యదర్శి బి శ్రీనివాసులు, టౌన్ అధ్యక్షుడు బి రఘువీరా, టౌన్ కార్యదర్శి కె వీరేష్, నందవరం మండల నాయకులు నాగరాజు, గోనెగండ్ల మండల మహిళా నాయకురాలు బి నాగశేషమ్మ, వరలక్ష్మి, నర్సింహులు, సాయిబన్న తదితరులు పాల్గొన్నారు

## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన యమ్ పీ. యమ్ యల్ ఏ

### 10లక్షల రూపాయల వ్యయంతో 14 వ వార్డులో అభివృద్ధి పనులు



నంద్యాలసెప్టెంబర్ 22 ( విభారె) :- నంద్యాల పట్టణంలో బుధవారం నాడు 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బి టి రోడ్డు ను ప్రారంభించిన నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి .నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి. 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించినారు. బుధవారం పట్టణంలోని 14 వ వార్డులో ని తులసి వనం దగ్గర 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బి టి రోడ్డు ను రోడ్డు ప్రారంభించిన నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి .నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి . నంద్యాల పురపాలక సంఘం అధ్యక్షురాలు షేక్ మాబున్నిషా. పురపాలక సంఘం ఉపాధ్యక్షులు గంగిశెట్టి వెంకట నాగ శ్రీధర్. మార్కెట్ యార్డ్ చైర్మన్ ఇసాక్ భాష. మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణ లతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించి రోడ్డు ను ప్రారంభించినారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి .నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి లు మాట్లాడుతూ నంద్యాల పట్టణం లోని 14 వ వార్డులో ని తులసీ వనం దగ్గర పురపాలక సంఘము సాధారణ నిధుల నుండి 10 లక్షల రూపాయల వ్యయంతో బి టి రోడ్డు ను ప్రారంభించుకున్నామని అన్నారు. నంద్యాల పట్టణంలోని ప్రధాన రహదారులు కాకుండా అంతర్గత రహదారులు కూడా నిర్మించుకొని నంద్యాల ను సుందరీకరణ పట్టణంగా తీర్చి దిద్దుకుందామన్నారు. వీరి వెంట మున్సిపల్ కౌన్సిలర్లు. కో ఆప్షన్ సభ్యులు. సచివాలయ సిబ్బంది మీతదితరులు ఉన్నారు.

# డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తుగ్గలి సెప్టెంబర్ 22, (( విభారె) ): డీలర్ల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తుగ్గలి మండల డీలర్లు ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్ళగా రాష్ట్ర పిలుపు మేరకు డీలర్ల అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి,ఉపాధ్యక్షుడు సుంకన్న ఆధ్వర్యంలో తుగ్గలి మండలం డీలర్లు ఈ-పాస్ మీటర్లు మొరాయింపు వలన స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర బుధవారం రోజున తుగ్గలి మండలం డీలర్లు ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్.ఐ సుధాకర్ రెడ్డి కు మెమోరాండం ను అందజేశారు. ఈ-పాస్ మిషన్ వలన ప్రభుత్వ ధాన్యాల పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోండడం వలన ఈ-పాస్ మీటర్లు ఎమ్మార్వో ఆఫీస్ లో డీలర్లు అప్పజెప్పారు. ఈ నెల 19న ప్రారంభమైన పిఎంజికేవై పంపిణీలో ఈపాస్ మిషన్లు సరిగ్గా పనిచేయక డీలర్లు మరియు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలియజేశారు. ప్రభుత్వం వెంటనే డీలర్లపై చొరవచూపి ఈ-పాస్ మిషన్ లను మరియు సర్వర్లను సరిగ్గా పనిచేసే విధంగా రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ మహమ్మద్,రాజశేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి,సుదర్శన్,గౌరన్న,చంద్రన్న మరియు పురుషోత్తం తదితర డీలర్లు పాల్గొన్నారు.

# 'ఘోస్ట్' మూవీలో హీరోయిన్ గా కాజల్ ఫస్ట్ ఛాయిస్ కాదా..??

కింగ్ అక్కినేని నాగార్జున - డైరెక్టర్ ప్రవీణ్ సత్తారు కాంబినేషన్ లో "ఘోస్ట్" అనే హై ఆక్టేన్ యాక్షన్ థ్రిల్లర్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో నాగ్ రా ఏజెంట్ గా కనిపించబోతున్నారు. ఇది ఎంటర్టైనింగ్ అండ్ యాక్షన్ ప్యాక్డ్ రోల్ అని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల విడుదల చేసిన టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ కు విశేష స్పందన లభించింది. ఇందులో నాగార్జున సరసన కాజల్ అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇది వీరి కాంబోలో వస్తున్న ఫస్ట్ సినిమా. నాగ్ తో



పాటుగా కాజల్ కూడా ఈ చిత్రంలో ఫైట్స్ చేయనుంది. ఆమె ఇంతకుముందు చేయని సరికొత్త పాత్ర పోషిస్తోంది. అయితే ఈ సినిమాలో హీరోయిన్ గా ఫస్ట్ ఛాయిస్ కాజల్ అగర్వాల్ కాదని తెలుస్తోంది.'ఘోస్ట్' సినిమాలో నాగార్జున కు జోడీగా ముందుగా గోవా బ్యూటీ ఇలియానా ను అనుకున్నారు. దీనికి ఇల్లీ బేబీ సైడ్ నుంచి గ్రీన్ సిగ్నల్ కూడా వచ్చిందట. అయితే ఎందుకనో చివరకు ఇలియానాను కాదనికాజల్ అగర్వాల్ కు ఈ ఆఫర్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. గతంలో నాగ్ - లారెన్స్ కలయికలో వచ్చిన 'డాన్' సినిమాలో ముందుగా ఇలియానా నే హీరోయిన్ గా అనుకున్నారు. కానీ చివరకు అనుష్క ను ఫైనలైజ్ చేశారు. ఇప్పుడు 'ఘోస్ట్' అవకాశం కూడా గోవా బ్యూటీ చేజారి కాజల్ చేతికి వచ్చిందట. ఇలియానా చివరిగా తెలుగులో 'అమర్ అక్బర్ ఆంటోని' సినిమాలో నటించింది. ఈ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆ తర్వాత మళ్ళీ తెలుగు సినిమాలో కనిపించలేదు. ఇదిలా ఉండగా 'ఘోస్ట్' సినిమా నుంచి కాజల్ అగర్వాల్ తప్పుకోనుందని టాక్ నడుస్తోంది. గౌతమ్ కిచ్లు ని వివాహం చేసుకున్న కాజల్ ప్రస్తుతం ప్రెగ్నెంట్ అని.. ఆ కారణంతోనే సినిమాలో నటించడం లేదని గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇందులో నిజమెంతో తెలియాలంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే. ఇకపోతే 'గోస్ట్' సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. ఇండియాలోని ప్రధాన నగరాలతో పాటుగా విదేశాలలో ఈ సినిమాలోని కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ ప్లాన్ చేస్తున్నారు. సోనాలి నారంగ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పి మరియు నార్త్ స్టార్ ఎంటర్టైన్మెంట్ ప్రై.లి బ్యానర్స్ పై ఈ సినిమా రూపొందుతోంది. నారాయణ్ దాస్ కె నారంగ్ - పుష్కర్ రామ్మోహనరావు - శరత్ మరార్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో గుల్ పనాంగ్ - అనైకా సురేంద్రన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ముఖేష్.జి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. బ్రహ్మ కడలి ఆర్ట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తున్నారు. రాబిన్ సుబ్బు మరియు నభా మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. 'ఘోస్ట్' సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# స్టన్నర్ లుక్ తో 2.0 బ్యూటీ రీలోడెడ్

స్టార్ ఫిలిం మేకర్ శంకర్ తెరకెక్కించిన '2.0' చిత్రం తర్వాత బ్రిటన్ బ్యూటీ అమీజాక్సన్ సినిమాలకు దూరమైన సంగతి తెలిసిందే. కెరీర్ ఆరంభంలోనే టాప్ క్లాస్ డైరెక్టర్ల చిత్రాల్లో భాగమైంది. ఏ. ఎల్ విజయ్..శంకర్... అట్లీ లాంటి దర్శకులతో పనిచేసి నటిగా ఆరితేరింది. కానీ కెరీర్ మాత్రం బిల్డ్ చేసుకోలేకపోయింది. భారీ బడ్జెట్ చిత్రాల్లో నటించే అవకాశం దక్కినా అమీ సక్సెస్ కాలేకపోయింది. ఇక బాలీవుడ్ లోనూ అదే పరిస్థితి. తెలుగులో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన 'ఎవడు'లో నటించింది. కానీ ఇక్కడా నిలదొక్కుకోలేకపోయింది. అటుపై విదేశీయుడితో డేటింగ్ లో మునిగి తేలి..చివరికి పెళ్లి కాకుండానే ఓ బిడ్డకు జన్మనిచ్చింది. అటుపై భారతీయ ఫిలిం మేకర్స్ అమీ వైపు చూసింది లేదు.ప్రస్తుతం లండన్ లో తన భర్త జార్జి.. కుమారునితో నివాసం ఉంటోంది. సోషల్ మీడియాలో అభిమానులకు టచ్ లో ఉండటం తప్ప..అమీ ప్రొఫెషనల్ గా చేసేదేమీ కనిపించలేదు. అయితే కొన్ని ఆంగ్ల ప్రకటనల్లో నటిస్తూ ఎమీ ఆర్జిస్తోంది. తాజాగా ఓ కొత్త ఫోటో షూట్ లో పాల్గొని మంటలు రేపింది. ఓ డిజైనర్ లుక్ లో అమీ తళుక్కున మెరిసింది. నారింజ రంగు కోట్...మ్యాచింగ్ హ్యాండ్ బ్యాగుతో సపోర్టింగ్ స్టూడియో వాల్ పై ఓరగా వాలి ఫోటో సెషన్ లో పాల్గొంది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. లండన్ కిక్ స్టార్ట్ అంటూ అమీ ఓ కామెంట్ కూడా పోస్ట్ చేసింది. అంటే అమ్మడు కెరీర్ ఇకపై ఇక్కడే అనుకునేలా ఓ చిన్న హింట్ ఇచ్చింది. అమీజాక్సన్ బేసిక్ గా బ్రిటన్ కి చెందిన పాపులర్ మోడల్ కం నటి. మిస్ టీన్ వరల్డ్ గాను నిలిచింది. అమీ సినిమా కెరీర్ తొలుత హాలీవుడ్ లోనే ప్రారంభమైంది. వార్నర్ బ్రదర్స్ నిర్మించిన 'సూపర్ గాళ్' కామిక్ చిత్రంలో నటించింది. అటుపై అక్కడా అవకాశాలు రాకపోవడంతో నేరుగా కోలీవుడ్ లో అడుగు పెట్టింది. ఇక్కడ 'మదరాసు పట్టణం' సినిమాతో లాంచ్ అయింది. ఈ చిత్రానికి ఏ. ఎల్ విజయ్ దర్శకత్వం వహించారు. ఆ తర్వాత అదే దర్శకుడు పనిచేసిన 'తాండవం' సినిమాలో నటించింది. ఆ తర్వాత శంకర్ కాంపౌండ్ లోకి అడుగు పెట్టింది. అక్కడ ఎన్నో పోటీల్లో పాల్గొంది. అమెరికన్ వెబ్ సిరీస్ లలో నటించేందుకు ఇంతకుముందు సంతకాలు చేసింది. అయితే ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఏవీ లేవు. తదుపరి సూపర్ గాళ్ తరహా పాత్రతో మెప్పిస్తుందని భావించినా దానికి సంబంధించిన అప్ డేట్ లేదు. ఏడాదిన్నర క్రితమే అమీ జాక్సన్ బేబి బంప్ సందడి సోషల్ మీడియాలో అంతా ఇంతా కాదు. నెలలు నిండే క్రమంలో నిరంతరం ఎమీ తన అనుభవాల్ని అనుభూతుల్ని అభిమానులతో పంచుకుంది. ఎట్టకేలకు చిట్టికన్నయ్య 2.0 అరైవ్ అయ్యాక ఇక ఆ ఆనందాన్ని కూడా ఏమాత్రం దాచుకోలేదు. నిరంతర ఫోటోషూట్లతో ఒకటే అంతర్జాలాన్ని హీటెక్కించేస్తోంది. బేబీ బోయ్ కి ఆండ్రియాస్ అని నామకరణం చేసింది మొదలు తనతో ఇప్పటికే లెక్కకు మిక్కిలి ఫోటోషూట్లలో పాల్గొంది అమీజాక్సన్. కాబోయే భర్త జార్జ్ పనాయోటౌ ..మాస్టర్ ఆండ్రియాస్ తో కలిసి అమీజాక్సన్ దేశ విదేశాల్లో విహారయాత్రలకు వెళ్లిన ఫోటోలు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. అద్భుతమైన ఫోటోల తో తరచూ ట్రెండ్ చేసే ఎమీ జాక్సన్ ఇన్ స్టాగ్రామ్ లో తాజాగా మరికొన్ని చక్కని ఫోటోల్ని జోడించింది. కాబోయే భర్త జార్జ్ పనాయోటౌ వారి ఏడాది పుత్రరత్నం ఆండ్రియాస్ తో కలిసి లండన్ లో హ్యాపీ లైఫ్ ని పూర్తిస్థాయిలో ఆనందిస్తున్నారు. జార్జ్ పనాయోటౌ -అమీ జంట ఇప్పటికే నిశ్చితార్థం చేసుకున్నారు. ఎంగేజ్ మెంట్ పార్టీని నిర్వహించారు. వారు తమ కుమారుడికి ఆండ్రియాస్ ను సెప్టెంబర్ లో జన్మనిచ్చారు. అప్పుడే కిడ్ బుడిబుడి నడకలతో సందడి చేసేయడం చర్చకు వచ్చింది.

# మహేష్ రిజెక్ట్ చేశాడు.. విజయ్ ఓకే చెప్పాడు..!

సూపర్ స్టార్ మహేష్ బాబు - డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్ లో వచ్చిన 'మహర్షి' సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవడమే కాకుండా ఎన్నో అవార్డులు గెలుపొందింది. ఈ సినిమా తర్వాత వెంటనే మహేష్ - వంశీ కలిసి మరో ప్రాజెక్ట్ చేయాలని అనుకున్నారు. అయితే వంశీ పైడిపల్లి తన కథతో మహేష్ ని మెప్పించలేకపోయారు. ఈ క్రమంలో దర్శకుడు స్క్రిప్టులో పలు మార్పులు చేసి హీరోని ఒప్పించే ప్రయత్నం చేశారు. దీని కోసం వంశీ చాలా ఎక్కువ సమయమే కేటాయించారు కానీ.. ఈ ప్రాజెక్ట్ మాత్రం సెట్ అవలేదు. ఈ నేపథ్యంలో మహేష్ 'సరిలేరు నీకెవ్వరు' చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకెళ్లారు.. పరశురామ్ చెప్పిన 'సర్కారు వారి పాట' కథను



ఓకే చేశారు. కాకపోతే వంశీకి ఫ్యూచర్ లో మళ్ళీ కలిసి వర్క్ చేద్దామనే మాటైతే ఇచ్చారు. దీంతో సూపర్ హిట్ సినిమా తీసినా కూడా పైడిపల్లికి చాలా గ్యాప్ వచ్చే పరిస్థితి ఏర్పడింది. అయితే ఇన్నాళ్లకు వంశీ తదుపరి ప్రాజెక్ట్ మీద క్లారిటీ వచ్చింది. కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ తో దర్శకుడు ఓ మల్టీ లాంగ్వేజ్ సినిమా చేయబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ మీద దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. దీని కోసం విజయ్ కు భారీ రెమ్యూనరేషన్ ముట్టజెప్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ అఫిషియల్ అనౌన్స్ మెంట్ ఉంటుందని వంశీ మొన్న సైమా వేడుకలప్పుడు వెల్లడించారు. 'బీస్ట్' సినిమా కంప్లీట్ అయిన తర్వాత ఈ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్లనుంది. అయితే అప్పుడు మహేష్ రిజెక్ట్ చేసిన కథతోనే పైడిపల్లి.. విజయ్ తో చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. మహేష్ బాబు నో చెప్పిన కథను విజయ్ కు వినిపించిన వంశీ పైడిపల్లి.. ఎలాంటి మార్పులు సూచించకుండా హీరో సైడ్ నుంచి గ్రీన్ సిగ్నల్ తెచ్చుకున్నారట. నిజానికి వంశీ చెప్పిన స్టోరీ బాగున్నప్పటికీ.. ఆల్రెడీ చేసిన జోనర్ లోనే ఉండటంతో మహేష్ తిరస్కరించారట. విజయ్ కు ఇది కొత్తగా అనిపించడంతో వెంటనే ఓకే చేశారు. మహేష్ నటించిన ఎన్నో సూపర్ హిట్ కథలను రీమేక్ చేసిన విజయ్.. ఈసారి మహేష్ రిజెక్ట్ చేసిన కథతో సినిమా చేయడానికి రెడీ అయ్యారన్నమాట. మరి ఈ సినిమా విజయ్ - వంశీ పైడిపల్లి లకు ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

# కేన్ మామ అదరగొట్టాడు.. అయినా అర్థ సెంచరీ వృథా!



ఐపీఎల్-2021 తొలి దశలో రాణించని సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రెండో అంచెలో ఎలాగైనా రాణించాలని భావిస్తోంది. గత తప్పిదాలు పునరావృతం చేయకుండా సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ క్రమంలో హైదరాబాద్ ఆటగాళ్లు పూర్తిగా ప్రాక్టీసులో నిమగ్నమయ్యారు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే బుధవారం నాటి మ్యాచ్ కోసం రెండు జట్లుగా విడిపోయి ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ ఆడారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఎస్ఆర్‌హెచ్ తమ ట్విటర్ ఖాతాలో పంచుకుంది. వివరాల ప్రకారం.. కెప్టెన్ విలియమ్సన్, బౌలర్ భువనేశ్వర్ కుమార్ జట్లు ఈ మ్యాచ్‌లో తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన భువీ టీం.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. ఇక లక్ష్య ఛేదనకు దిగిన కేన్ మామ సేన.. 4 వికెట్లు కోల్పోయి కేవలం 151 పరుగులే చేసి ఓటమి పాలైంది. దీంతో కేన్ విలియమ్సన్ అర్ధ సెంచరీ(41 బంతుల్లో 61 పరుగులు, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) వృథా అయింది. ఈ క్రమంలో కేన్ మాట్లాడుతూ.. తమ కుర్రాళ్లు బాగా కష్టపడుతున్నారని, కావాల్సినంత ప్రాక్టీసు దొరికిందని చెప్పుకొచ్చాడు. ఇక స్టార్ బౌలర్ రషీద్ ఖాన్.. "తొలి దశలో మేం మెరుగ్గా రాణించలేకపోయాం. అయితే, ఇప్పుడు మాత్రం కచ్చితంగా మంచి ప్రదర్శన కనబరిచి ముందుకు సాగుతాం" అని ధీమా వ్యక్తం చేశాడు.

# నటరాజన్‌కు కరోనా.. అయినా మ్యాచ్ యథాతథం

దుబాయ్: ఐపీఎల్-2021 రెండో దశలో భాగంగా నేడు సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌కు కొద్ది గంటల ముందు ఎస్ఆర్‌హెచ్ క్యాంప్‌లో కోవిడ్ కలకలం రేపింది. సన్‌రైజర్స్ బౌలర్ నటరాజన్‌కు కరోనా నిర్ధారణ కావడంతో అతనితో సన్నిహితంగా మరో ఆటగాడు విజయ్ శంకర్ సహా మరో ఐదుగురిని(టీమ్ మేనేజర్ విజయ్‌కుమార్, ఫిజియో శ్యామ్ సుందర్, డాక్టర్ అంజనా వన్నన్, లాజిస్టిక్స్ మేనేజర్ తుషార్ ఖేడ్కర్, నెట్ బౌలర్ పెరియసామి) ఐసోలేషన్‌కు తరలించారు. అయితే ఎస్ఆర్‌హెచ్ క్యాంప్‌లోని మిగతావారికి నెగెటివ్ రావడంతో నేటి మ్యాచ్ షెడ్యూల్ ప్రకారమే యథాతథంగా కొనసాగుతుందని బీసీసీఐ స్పష్టం చేయడం విశేషం. మహమ్మారి బారిన పడిన నటరాజన్‌కు ఎలాంటి లక్షణాలూ లేవని, అతను ప్రస్తుతం జట్టు సభ్యులకు దూరంగా మరో చోట ఐసోలేషన్‌లో ఉంటున్నాడని పేర్కొంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190